# విశాల భారతి

10-06-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 156




## తొలకరి పలకరింపు

- ఉరుములు, మెరుపులతో నగరాన్ని ముంచెత్తిన వాన
- లోతట్టు ప్రాంతాలు, రన్ వేలు నీట మునిగాయి
- ప్రధాన కూడళ్లలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి
- జీహెచ్ఎంసీ సిబ్బంది రంగంలోకి దిగి నీటిని తీస్తున్నారు
- అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని అధికారుల సూచన
- మరికొన్నిరోజుల పాటు భారీ వర్ష సూచన ఉంది

02



# యూరియా రాదు.. పంట కొనరు..!

## 22 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు

- భూయజమాని ఓటీపీ విధానం పెద్ద శాపం
- సబ్సిడీ దక్కక ఎరువులు బ్లాక్‌లో కొంటున్నారు
- ప్రభుత్వానికి పంట అమ్మడం కష్టంగా మారింది
- పంట నష్టపరిహారం రుణాలు యజమానులకే వెళ్తున్నాయి
- కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ అగ్రి సెక్టార్‌లో కౌలు రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. దాదాపుగా 22 లక్షల మంది అన్నదాతలకు సబ్సిడీ యూరియా దక్కని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వారు పండించిన పంటను అమ్ముకునే వీలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలు అందకపోవడం ఒకెత్తయితే, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే వచ్చే పరిహారం కూడా వారి చేతికి అందడం లేదు. ఇదీ ప్రస్తుతం రాష్ట్రంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న అతిపెద్ద దుస్థితి. ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ దువ్వూరు నరసింహారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల గుర్తింపు సాధన కమిటీ కౌలు రైతుల సమస్యలపై మంగళవారం ఒక సమగ్ర నివేదికను వెల్లడించింది. గత నెలలో 22 జిల్లాల్లోని 47 మండలాల్లో గల 57 గ్రామాల్లో 1816 మంది రైతులతో వ్యక్తిగతంగా మాట్లాడి సేకరించిన సర్వే వివరాలు క్షేత్రస్థాయి వాస్తవాలను కళ్లకు కట్టాయి. ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్రంలో

మిగతా 3లో..

# ధాన్యం సేకరణలో తెలంగాణే టాప్




- దేశంలోనే రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు
- యాసంగి పైసలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ
- దేశం మొత్తం వరి దిగుబడిలో తెలంగాణదే టాప్
- రెండేళ్ల కాంగ్రెస్ పాలనలోనే రైతులకు లబ్ధి
- కేంద్రం 52 లక్షల టన్నుల లిమిట్ పెడితే, 75 లక్షల టన్నులు కొన్నాం
- రాజకీయం ఆపి, రాష్ట్ర ధాన్యం కోటాను పెంచాలి

03

తెలంగాణ అన్నదాతల కష్టానికి, ప్రభుత్వ పక్కా ప్లానింగ్‌కు అద్దం పడుతూ రాష్ట్రంలో సరికొత్త రికార్డు నమోదైంది. ప్యాడీ ప్రొడక్షన్‌తో పాటు ధాన్యం సేకరణలోనూ తెలంగాణ నయా హిస్టరీ క్రియేట్ చేసింది. ఖరీఫ్, రబీ సీజన్లను క్లబ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలంగాణ ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. మంగళవారం మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన ఈ ఇంట్రెస్టింగ్ డీటెయిల్స్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఫుడ్ గ్రెయిన్స్ ప్రొడక్షన్‌లో తెలంగాణ నంబర్ వన్ పొజిషన్‌లో నిలిచిందని, రైతు సంక్షేమమే అల్టిమేట్ గోల్‌గా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఈ సందర్భంగా గట్టిగా నొక్కి చెప్పారు.



## బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే

- ప్రాజెక్టులు అడ్డుకున్నట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం
- సీఎం స్థాయి మరిచి అబద్ధాలు చెప్తున్నారు
- కాంగ్రెస్ గ్యారంటీల అమలుపై చర్చకు సిద్ధం
- దోపిడీలో బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే
- హైదరాబాద్‌లో మంత్రులంతా భూములు దోచుకుంటున్నారు
- రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు, జీతాలకూ పైసల్లేవు

03

## సింగరేణిలో మళ్లీ సమ్మె

- జూలైలో సమ్మె డిమాండ్లు తీర్చకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరిక
- 30 డిమాండ్లు కొత్త గనులు సొంత ఇళ్లు ఏర్పాటు చేయాలి
- భారీ బకాయిలు జెన్‌కో నుండి 56 వేల కోట్లు విడుదల చేయాలి
- వైద్య సేవలు మెడికల్ బోర్డులను వెంటనే పునఃప్రారంభించాలి
- క్రమబద్ధీకరణ కాంట్రాక్టు కార్మికులకు సమాన వేతనం ఇవ్వాలి
- ప్రైవేటీకరణ నిరోధం బొగ్గు బ్లాకుల వేలం నిలిపివేయాలి

03





## అంగన్‌వాడీల జీతాలు చెల్లించు

- 62 వేల మందికి రెండు నెలలుగా జీతాలు బంద్
- అంగన్‌వాడీల కష్టాలను మంత్రి పట్టించుకోవట్లేదు
- రూ.18 వేల జీతం హామీని కాంగ్రెస్ విస్మరించింది
- ఆందోళన చేస్తున్న మహిళలను పోలీసులు ఈడ్చుకెళ్లి అరెస్ట్ చేశారు
- మినీ అంగన్‌వాడీలకు ఏడాదిగా పెరిగిన వేతనాలు ఇవ్వలేదు

03

## నోట్ల కట్టలు.. కిలోల కొద్దీ బంగారం



- ఆర్ అండ్ బి చీఫ్ మోహన్ నాయక్ ఇళ్లపై ఏసీబీ తనిఖీలు
- మార్కెట్ విలువ ప్రకారం వంద కోట్ల అక్రమాస్తులు గుర్తింపు
- భారీగా గోల్డ్ బిస్కెట్లు, నగలు, వెండి వస్తువులు స్వాధీనం
- నగదు లెక్కింపు కోసం కౌంటింగ్ మెషిన్లు వాడిన అధికారులు
- అడ్డగోలుగా కాంట్రాక్టులు ఇచ్చి భారీగా వసూళ్లు
- కుటుంబ సభ్యుల పేరిట ప్లాట్లు, వ్యవసాయ భూముల కొనుగోలు

02

## అక్కలే కేసీఆర్‌కు వాతలు పెట్టారు

- మహిళా శక్తి పథకంలో భాగంగా కొత్త ఆర్టీసీ బస్సుల ప్రారంభం
- గతంలో మహిళలకు మంత్రి పదవి ఇవ్వలేదు, తాము ఇద్దరికి ఇచ్చాం
- మహిళల ఉచిత బస్సు ప్రయాణాల కోసం ఖర్చు
- 27 వేల ప్రభుత్వ పాఠశాలల బాధ్యతలు మహిళా సంఘాలకే
- హైటెక్ సిటీ వద్ద మహిళా పారిశ్రామికవేత్తల కోసం కేటాయింపు
- ఆడబిడ్డల ఆర్థిక ఎదుగుదల కోసం భారీ సాయం

02





## అట్టుడుకుతున్న పీవోకే

- భద్రతా దళాల కాల్పుల్లో 30 మంది మృతి, 200 మందికి గాయాలు
- ఎన్నికల రిజర్వేషన్ల పెంపును జేఏఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది
- పాక్ ప్రభుత్వం స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీస్తోందని ఆగ్రహం

02

# తొలకరి పలకరింపు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భాగ్యనగరంలో వరుణుడు భీభత్సం సృష్టించాడు. ఆకాశానికి చిల్లు పడిందా అనేలా కుండపోత వర్షం కురవడంతో ఒక్కసారిగా మహానగరం అతలాకుతలమైంది. మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా మారిన వాతావరణంతో నగరం చిమ్మచీకట్లను అమ్ముకుంది. నిమిషాల వ్యవధిలోనే ఉరుములు, మెరుపుల గర్జనలతో కూడిన భారీ వర్షం నగరాన్ని ముంచెత్తింది. దీంతో సాధారణ జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు ప్రాంతాలన్నీ క్షణాల్లో జలమయం కావడంతో అటు వాహనదారులు, ఇటు పాదచారులు నరకయాతన అనుభవించారు. ఊహించని ఈ వాన దెబ్బకు సిటీ రోడ్లన్నీ ఉధృతంగా ప్రవహించే నదులను తలపించాయి. కార్యాలయాల నుండి ఇళ్లకు తిరుగు ప్రయాణమైన ఉద్యోగులు వానలో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని దాదాపు అన్ని ప్రధాన కూడళ్లు, అంతర్గత రహదారులు వరద నీటితో చెరువులను తలపించాయి. పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్ లాంటి వీఐపి ప్రాంతాలతో పాటు యూసఫ్‌గూడ, టోలీచౌకి, ఫిలింనగర్ పరిసరాలు వరద ముంపునకు గురయ్యాయి. అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ,



సనత్‌నగర్ ప్రధాన రహదారులపై మోకాళ్లోతు నీరు చేరింది. రోడ్లపై డ్రైనేజీలు పొంగిపొర్లడంతో కాలనీల రోడ్లు కాలువలుగా మారాయి. ఈ ఆకస్మిక వరద ధాటికి ద్విచక్ర వాహనాలు, కార్లు నీట మునిగిపోయాయి. ముఖ్యంగా కూడళ్ల వద్ద నీరు గంటల తరబడి నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన ప్రయాణికులు రోడ్లపైనే గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మహానగరంలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది. ప్రధాన రహదారులపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఆఫీస్ వేళలు ముగిసి ఇళ్లకు వెళ్లే సమయంలో ఈ వర్షం పడటంతో ఐటి కారిడార్‌తో పాటు వ్యాపార సముదాయాలు ఉన్న ప్రాంతాలు భారీ ట్రాఫిక్ జామ్‌తో నరకాన్ని చూపించాయి. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం ఐటి హబ్‌లలో ఐటి ఉద్యోగుల వాహనాలు అంగుళం కూడా కదల్లేని పరిస్థితి ఏర్పడింది. మెట్రో స్టేషన్లు సైతం ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. బస్సు స్టాండ్‌లు, ఫ్లైఓవర్ల కింద వానకు తడవకుండా వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారింది. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి వాహనాలను క్రమబద్ధీకరించడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. లోతట్టు కాలనీల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. టోలీచౌకి పరిసర ప్రాంతాలలోని కాలనీలలోకి వరద నీరు ఇళ్లలోకి చేరింది. నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు నీట మునిగిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రసిద్ధ వ్యాపార కేంద్రమైన అమీర్‌పేట్ పరిసరాల్లోని హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా నిండిపోవడంతో మురుగు నీరు, వర్షపు నీరు కలిసి రోడ్ల పైకి ప్రవహించింది. దీంతో నగరంలో తీవ్రమైన దుర్వాసనతో కూడిన వాతావరణం ఏర్పడింది. కాలనీలలో నిలిచిన నీటిని తొలగించడానికి స్థానికులు రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. ఈ భారీ విపత్తు నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం అత్యవసరంగా రంగంలోకి దిగింది. నగర మేయర్, కమిషనర్ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలను నగరంలోని సున్నితమైన, లోతట్టు ప్రాంతాలకు తరలించారు. ప్రధాన రహదారులపై నిలిచిన నీటిని తొలగించడానికి మోటార్లను ఏర్పాటు చేశారు. మ్యాన్‌హోల్స్ తెరిచి ఉన్న ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు.

# నోట్ల కట్టలు.. కిలోల కొద్దీ బంగారం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఆ నోట్ల కట్టలను చూస్తే సామాన్యుడికి మైండ్ బ్లాంక్ అవ్వడం ఖాయం. ఒక ప్రైవేట్ బ్యాంకు చెస్ట్ రూమ్‌ను తలపించేలా ఇళ్లలో గుట్టలుగా పడి ఉన్న కరెన్సీ నోట్లు, జువెలరీ షాపును సైతం చిన్నబోయేలా చేసే కిలోల కొద్దీ బంగారు ఆభరణాలు చూసి దర్యాప్తు అధికారులే నోరెళ్లబెట్టారు. అంతటితో ఆగకుండా పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీ డైరీని తలపించేలా గుట్టలుగా దొరికిన ఆస్తి పత్రాలు, షెడ్లలో వరుసగా నిలిపిన లగ్జరీ కార్లు, ఖరీదైన ద్విచక్ర వాహనాలు, నిలవలతో నిండిపోయిన బ్యాంకు లాకర్లు ఒకటా రెండా.. వీటన్నింటినీ చూస్తుంటే దేశంలోనే అత్యంత ధనవంతుడైన ముఖేష్ అంబానీ సైతం అసూయపడేలా ఉంది ఆ రేంజ్ సంపాదన. అలాగని అతడేమీ వంశపారంపర్యంగా వచ్చిన అపార కుబేరుడు కాదు, కనీసం ప్రపంచ అపరకోటీశ్వరుడు ఎలాన్ మస్క్‌కు తోబుట్టువు అంతకన్నా కాదు. ప్రభుత్వ ఖజానా నుంచి జీతం తీసుకునే ఒక సాధారణ ఉన్నతాధికారి వద్ద ఇంతటి లగ్జరీ సామ్రాజ్యం ఎలా సాధ్యమైంది అనేది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత అవినీతి నిరోధక శాఖకు పూర్తి స్థాయిలో అధికారాలు ఇస్తూ విపరీతమైన స్వేచ్ఛను ఇచ్చారు. ముఖ్యమంత్రి నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఏసీబీ డిపార్ట్మెంట్ అధికారులు అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తూ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు జరుపుతున్నారు. వ్యవస్థను పట్టి పీడిస్తున్న అవినీతి తిమింగలాల ఆట కట్టిస్తూ లంచం తీసుకుంటున్న సమయంలోనే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నారు. ప్రజాధనాన్ని కాజేసి అక్రమంగా వెనకేసిన వందల కోట్ల రూపాయల ఆస్తులను స్వాధీనం చేసుకుంటూ ప్రభుత్వ పరంగా సీజ్ చేస్తున్నారు. సమాజంలో పెద్దమనుషులుగా చలామణి అవుతూ తెరవెనుక అవినీతి దందాలు సాగిస్తున్న అధికారులను బేడీలు వేసి కటకటాల వెనక్కి నెడుతున్నారు. గత కొంతకాలంగా తెలంగాణ వ్యాప్తంగా ఈ అవినీతి ప్రక్షాళన ప్రక్రియ ఎక్కడా బ్రేక్ లేకుండా నిరాటంకంగా, అత్యంత వేగంగా సాగిపోతోంది. ఇంత పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నప్పటికీ, తోటి అధికారులు జైలుకు వెళ్తున్నప్పటికీ కొంతమంది





అవినీతి అధికారులలో ఏమాత్రం భయం కలగడం లేదు, వారి పాత ధోరణిని మార్చుకోవడం లేదు. పైగా లంచాల వసూళ్ల విషయంలో సరికొత్త రికార్డులను సృష్టిస్తూ ముడుపుల రేట్లను భారీగా పెంచేసి సరికొత్త బెంచ్ మార్క్ సెట్ చేస్తున్నారు. దర్యాప్తు సంస్థల కన్నుగప్పేందుకు తమ సొంత పేర్లతో కాకుండా బంధువులు, స్నేహితులు, నమ్మకస్తులైన బినామీల పేర్లతో నగరాల చుట్టూ భారీగా భూములను సంపాదిస్తున్నారు. ఒకటి, రెండు చోట్ల ఇళ్లు కొనడంతో సరిపెట్టకుండా ఏకంగా వందల కోట్ల విలువైన అక్రమ ఆస్తులను కూడబెడుతూ తమ సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నారు. చట్టానికి దొరకకుండా ఎంత జాగ్రత్తపడ్డా ఏసీబీ అధికారులు వారి నెట్‌వర్క్‌ను ఛేదిస్తూ అవినీతి తిమింగలాల గుట్టు రట్టు చేస్తున్నారు. తాజా ఎపిసోడ్‌లో హైదరాబాదులోని రోడ్లు, భవనాల శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్ నివాసంతో పాటు ఆయన బంధువులు, ఆప్తుల ఇళ్లలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో దొరికిన అక్రమ ఆస్తుల వివరాలు చూసి స్వయంగా దర్యాప్తు అధికారులే షాక్‌కు గురయ్యారు. సోదాలు జరిగిన ఇళ్లలో భారీ సంఖ్యలో స్వచ్ఛమైన బంగారు బిస్కెట్లు, ఖరీదైన డైమండ్ ఆభరణాలు, వెండి వస్తువులు బయటపడ్డాయి. ఇళ్లలో లభ్యమైన కరెన్సీ నోట్ల పరిమాణం విపరీతంగా ఉండడంతో వాటిని చేత్తో లెక్కించడం సాధ్యం కాక ఏకంగా బ్యాంకు నుంచి లెక్కింపు యంత్రాలను రప్పించాల్సి వచ్చింది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి తనకు నచ్చిన కాంట్రాక్టర్లకు పనులను కేటాయించడం, ఆ కేటాయింపులకు బదులుగా కోట్ల రూపాయల లంచాలు డిమాండ్ చేయడం మోహన్ నాయక్ నిత్యకృత్యంగా మార్చుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ఇలా అడ్డగోలుగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టులు ఇస్తూ కమీషన్ల రూపంలో భారీగా డబ్బు దండుకోవడం ఒక వ్యసనంగా మార్చుకున్నాడు. ఇలా సంపాదించిన అక్రమ సొమ్ముతో హైదరాబాద్ నగర పరిసరాల్లోని ఐటీ కారిడార్, గచ్చిబౌలి వంటి ఖరీదైన ప్రాంతాలలో పట్టువదలని విక్రయ నివాసాలు, విలాసవంతమైన ఫ్లాట్లను కొనుగోలు చేశాడు. కేవలం రియల్ ఎస్టేట్ మాత్రమే కాకుండా కిలోల కొద్దీ బంగారం, నగర శివార్లలో వందల ఎకరాల వ్యవసాయ భూములను కూడా తన పేరిట మార్పించుకున్నాడు. తనపై అనుమానం రాకుండా ఉండేందుకు తన భార్య, పిల్లలు, ఇతర కుటుంబ సభ్యుల పేర్ల మీద కూడా కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించాడు. ప్రస్తుతం ఇతడి వద్ద లభ్యమైన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్లో ఏకంగా 100 కోట్ల రూపాయల వరకు ఉంటుందని ప్రాథమిక అంచనా వేస్తున్నారు. ఇంకా కొన్ని కీలకమైన భూమి పత్రాలను, నగరంలో ఉన్న ఇతర స్థిరాస్తుల విలువను పూర్తిగా లెక్కించాల్సి ఉందని ఏసీబీ ఉన్నతాధికారులు అధికారికంగా వెల్లడించారు. ఇటీవల కాలంలో ఏసీబీ అధికారులు ఎండీఏ, మున్సిపల్, రెవెన్యూ శాఖల్లో విస్తృతంగా దాడులు చేసినప్పటికీ, ఎంతోమంది పెద్ద తలకాయలను అరెస్ట్ చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితిలో ఆశించిన మార్పు రావడం లేదు. లంచం ఇవ్వనిదే ఫైలు కదలని పరిస్థితి కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకా కొనసాగుతూనే ఉంది. అందువల్లే ప్రభుత్వం నుంచి వచ్చిన స్పష్టమైన ఆదేశాల ప్రకారం చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఎవరినీ వదిలిపెట్టకుండా ఏసీబీ అధికారులు ప్రతి అనుమానాస్పద అధికారిపై నిఘా పెట్టి తనిఖీలు చేస్తున్నారు. అవినీతికి పాల్పడినట్లు పక్కా ఆధారాలు దొరికితే ఎంతటి పీఠంపై ఉన్నవారినైనా సరే కటకటాల వెనక్కి పంపిస్తూ జైలు ఊచలు లెక్కపెట్టిస్తున్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో అక్రమార్కులు సాంకేతికతను వాడుకుంటూ క్రిప్టో కరెన్సీ, విదేశీ పెట్టుబడుల రూపంలో కూడా లంచాల సొమ్మును మళ్లిస్తున్నట్లు ఏసీబీ ఇంటెలిజెన్స్ విభాగానికి సమాచారం అందింది. దీంతో దర్యాప్తు అధికారులు సైతం ట్రెండీ టెక్నాలజీని వాడుతూ ఫోరెన్సిక్ ఆడిటింగ్, డిజిటల్ డేటా అనలిటిక్స్ ద్వారా అవినీతి తిమింగలాల గుట్టును రట్టు చేస్తున్నారు. సామాన్య ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసి రౌండ్ ది క్లాక్ నిఘాను కొనసాగిస్తున్నారు. లంచగొండితనంపై సోషల్ మీడియా వేదికల ద్వారా వస్తున్న పోస్టులను సైతం సుమోటోగా స్వీకరిస్తూ వెనువెంటనే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ఈ దూకుడు చూస్తుంటే రాబోయే రోజుల్లో మరికొంత మంది అక్రమార్కుల జాతకాలు తారుమారు కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఒకప్పుడు ఏసీబీ దాడులు అంటే కేవలం వేల రూపాయల లంచాలకే పరిమితం అయ్యేవి, కానీ ఇప్పుడు సీన్ పూర్తిగా మారిపోయింది. నేటి కాలంలో అవినీతి అధికారులు కోట్లలో డీల్స్ కుదుర్చుకుంటూ లగ్జరీ లైఫ్ స్టైల్‌ను అలవాటు చేసుకుంటున్నారు. ఇలాంటి వారిని పట్టుకోవడానికి ఏసీబీ ప్రత్యేకంగా ఒక టాస్క్ ఫోర్స్ బృందాన్ని రంగంలోకి దించింది. పక్కా స్కెచ్‌తో, ఎక్కడా లీకులు లేకుండా ఆపరేషన్లను నిర్వహిస్తూ ప్రభుత్వ శాఖలలో క్లీన్ అప్ డ్రైవ్‌ను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రక్షాళన కార్యక్రమం నిజాయితీ గల అధికారుల్లో నూతనోత్సాహాన్ని నింపుతోంది.

# అక్కలే కేసీఆర్‌కు వాతలు పెట్టారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మహిళా లోకానికి సరికొత్త ఆర్థిక రెక్కలు తొడుగుతూ తెలంగాణ సర్కార్ సరికొత్త రికార్డు సృష్టించింది. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విప్లవాత్మక అడుగు వేశారు. మహిళా శక్తి పథకంలో భాగంగా 553 సరికొత్త ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనాలు కేవలం రవాణా సాధనాలు కావు, నారీమణుల ఆర్థిక స్వాలంబనకు నిలువెత్తు సాక్ష్యాలని సీఎం ఉద్ఘాటించారు. దేశంలో మహిళలకు మొట్టమొదట ఓటు హక్కు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గర్వంగా ప్రకటించారు. నవ శకానికి నాంది పలుకుతూ జరిగిన ఈ సభలో సీఎం ప్రసంగం ఆద్యంతం ఉత్సాహభరితంగా, ఆలోచింపజేసేలా సాగింది. రాజకీయ యవనికపై నారీ శక్తికి అగ్రతాంబూలం ఇచ్చింది తామేనని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించిన చరిత్ర తమదేనని గుర్తుచేశారు. ఇదే క్రమంలో ప్రతిపక్ష బీజేపీపై పదునైన విమర్శలు గుప్పించారు. జాతీయ స్థాయిలో అగ్రగామిగా చెప్పుకునే బీజేపీ, ఇప్పటివరకు ఒక్కసారైనా మహిళకు అధ్యక్ష పీఠం ఎందుకు అప్పగించలేదని నిలదీశారు. తమ పాలనలో మహిళల అడుగుజాడలే స్ఫూర్తి అని, భవిష్యత్ నిర్ణయాల్లో వారిని భాగస్వామ్యం చేయడం ఖాయమని భరోసా ఇచ్చారు. గత పాలకుల అలసత్వాన్ని ఎండగడుతూ, కేసీఆర్ తొలి 5 ఏళ్ల పాలనలో ఒక్క మహిళకు కూడా మంత్రి పదవి దక్కకపోవడం దారుణమన్నారు. తమ కేబినెట్‌లో ఇద్దరు మహిళా మంత్రులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని సగర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలోని 67 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులే ఈ ప్రభుత్వానికి అసలైన బలం, బలగం అని సీఎం కొనియాడారు. ఆడబిడ్డల ఆగ్రహానికి గురైన ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదని హెచ్చరించారు. గత పాలకులు ఫామ్‌హౌస్‌లకే పరిమితం కావడానికి మన అక్కాచెల్లెళ్లు ఇచ్చిన గట్టి షాకే కారణమని ఎద్దేవా చేశారు. తాము తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణ పథకం విద్యా రంగంలో పెను మార్పులు తెచ్చిందన్నారు. ఈ పథకం వల్ల స్కూళ్లలో బాలికల డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా తగ్గిందని సంతోషం వ్యక్తంచేశారు. నారీమణుల ఉచిత ప్రయాణాల కోసం తమ ప్రభుత్వం ఏకంగా 10000 కోట్ల రూపాయలు వెచ్చించిందని వివరించారు. ఈ అద్భుత పథకాన్ని అడ్డుకోవడానికి కొంతమంది స్వార్థపరులు తీవ్రంగా ప్రయత్నించారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలు ఆటో డ్రైవర్లను తప్పుదోవ పట్టించి రోడ్లపైకి నెట్టాయని సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్రలను తిప్పికొడుతూ మహిళా సాధికారతకు మరిన్ని బాధ్యతలు అప్పగించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 27000 ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను నారీ శక్తికే అప్పగించినట్లు వెల్లడించారు. మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన సరుకుల సరఫరా బాధ్యతను సైతం మహిళలే విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. పెట్రోల్ బంకుల యాజమాన్య బాధ్యతలు స్వీకరించిన మహిళలు ఇప్పుడు లక్షల్లో లాభాలు గడిస్తూ కార్పొరేట్ శైలిలో దూసుకుపోతున్నారని ప్రశంసించారు. మహిళల ఆలోచనలు, వ్యాపారాలకు వేదికగా నిలిచేందుకు 8000 స్త్రీ శక్తి భవనాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయబోతున్నట్లు సీఎం ప్రకటించారు. కార్పొరేట్ కార్యాలయాల నమూనాలను తలదన్నేలా ఈ స్త్రీ శక్తి భవనాల నిర్మాణం జరుగుతుందని రేవంత్‌రెడ్డి వివరించారు. ఐటీ హబ్ అయిన హైటెక్ సిటీ సమీపంలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం 1000 కోట్ల రూపాయల విలువైన భూమిని కేటాయించినట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో, సకల సౌకర్యాలతో 106 స్టాల్స్‌తో కూడిన భారీ మాల్‌ను సైతం నిర్మించామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోటి మంది ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టి, వారిని కోటీశ్వరులుగా మార్చడమే తమ ప్రభుత్వ అంతిమ లక్ష్యమన్నారు. దళారీ వ్యవస్థకు, దోపిడీదారులకు ప్రజా ప్రభుత్వంలో అస్సలు చోటులేదని గట్టిగా హెచ్చరించారు. ఈ ప్రజా ప్రభుత్వం 2034 వరకు నిరాటంకంగా కొనసాగుతుందని, ప్రజల ఆశీస్సులు తమకున్నాయని ధీమా వ్యక్తంచేశారు. మహిళల సంక్షేమం కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వారి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటుగా 60000 కోట్ల రూపాయల భారీ రుణాలను అందిస్తున్నామని తెలిపారు. పండగలు, పబ్బాలకు ఆడబిడ్డల ముఖంలో ఆనందం చూడటమే లక్ష్యంగా నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తున్నామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నాసిరకం చీరలను ఎవరైనా కట్టుకున్నారా అంటూ సభను ప్రశ్నించారు. కేసీఆర్ మార్కు మోసాలకు, తమ ప్రభుత్వ నిజాయితీకి ఉన్న తేడాను మహిళలే గమనిస్తున్నారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో పంట మార్పిడి పద్ధతులపై మహిళలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంలో చొరవ చూపాలని సీఎం పిలుపునిచ్చారు. తెలంగాణ సమాజంలో సగభాగంగా ఉన్న నారీ శక్తిని కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, వారిని నిజమైన ప్రగతి భాగస్వాములుగా మార్చడమే ధ్యేయంగా అడుగులు పడుతున్నాయి. బస్సుల పంపిణీతో ప్రారంభమైన ఈ ప్రస్థానం, పారిశ్రామిక రంగానికి విస్తరించడం విశేషం. ఆధునిక సాంకేతికతను జోడించి మహిళా సంఘాలు తయారుచేసే ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా ఈ నూతన విధానాలు ఉంటాయని పాలకవర్గం భావిస్తోంది. సభకు హాజరైన వేలాది మంది మహిళల కోలాహలం, హర్షధ్వానాల మధ్య ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామీణ, పట్టణ మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం సరికొత్త వ్యూహాలతో ముందుకు సాగుతోంది. కేవలం సబ్సిడీలు ఇవ్వడమే కాకుండా, వారిలో వ్యవస్థాపక నైపుణ్యాలను పెంచడానికి ప్రత్యేక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఐటీ, సేవా రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగేలా ఈ స్త్రీ శక్తి భవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించినప్పుడే మహిళలకు నిజమైన గౌరవం దక్కుతుందని ప్రభుత్వం నమ్ముతోంది. భద్రతతో కూడిన ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా తెలంగాణను దేశంలోనే మహిళా సంక్షేమ రాష్ట్రంగా నిలబెట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి గట్టి సంకల్పంతో ఉన్నట్లు స్పష్టమవుతోంది. పరిపాలనలో పారదర్శకత, సామాజిక న్యాయం చేకూర్చడమే లక్ష్యంగా ఇరువై నాలుగు గంటలూ శ్రమిస్తామని సీఎం పునరుద్ఘాటించారు. మహిళల రక్షణ కోసం పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ, సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. సమాజంలో మహిళల స్థానం అత్యున్నతంగా ఉన్నప్పుడే ఆ రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుందని విశ్లేషించారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలతో ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపుతామని హామీ ఇచ్చారు. పరేడ్ గ్రౌండ్స్ వేదికగా సాగిన ఈ సభ తెలంగాణ రాజకీయాల్లో, మహిళా అభ్యుదయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.





# అట్టుడుకుతున్న పీవోకే

- భద్రతా దళాల కాల్పుల్లో 30 మంది మృతి, 200 మందికి గాయాలు
- ఎన్నికల రిజర్వేషన్ల పెంపును జేఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది
- పాక్ ప్రభుత్వం స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీస్తోందని ఆగ్రహం
- జేఏసీపై నిషేధంతో ఆందోళనలు మరింత ఉధృతం
- రావల్‌కోట్, ముజఫరాబాద్‌లలో పరిస్థితులు దారుణం
- నిరసనకారులపై కాల్పులు, టియర్ గ్యాస్ ప్రయోగాలు

**విశాలభారతి, అంతర్జాతీయం:**




పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతం ప్రస్తుతం అగ్నిపర్వతంలా మారుతోంది. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు సాగుతున్న నిరసనలు ఉధృత రూపం దాల్చి, ఆ ప్రాంతాన్ని రణరంగంగా మార్చాయి. పాకిస్థాన్ పాలనపై విసిగిపోయిన స్థానిక ప్రజలు, దశాబ్దాలుగా తమను అణచివేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి పోరాడుతున్నారు. పాలకుల అరాచకాలను ఎదిరించే క్రమంలో నిరసనకారులు, భద్రతా దళాల మధ్య జరిగిన ఘర్షణలు రక్తపాతానికి దారితీశాయి. పాకిస్థాన్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ, తుపాకుల నీడలో ప్రజలను శాసించేందుకు ప్రయత్నించడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఈ ఉద్రిక్త పరిస్థితుల వల్ల సామాన్యుల జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఘర్షణల్లో ప్రాణనష్టం భారీగా నమోదైంది. భద్రతా దళాలు జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో సుమారు 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ అకృత్యాలలో 200 మందికి పైగా తీవ్రంగా గాయపడి ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న ప్రజలపై దళాలు కాల్పులు జరపడం మానవ హక్కుల ఉల్లంఘనకు నిలువెత్తు నిదర్శనంగా మారింది. నిరసనకారులను చెదరగొట్టే పేరుతో వందల సంఖ్యలో టియర్ గ్యాస్ సెల్స్ ప్రయోగించడంతో, ప్రాంతమంతా ఉద్విగ్న పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనలకు ప్రధాన కారణం రానున్న ఎన్నికల్లో పాకిస్థాన్ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక నిర్ణయాలే. జూలై 27న జరగనున్న శాసనసభ ఎన్నికల్లో మొత్తం 45 స్థానాలకు గాను, 12 స్థానాలను పాకిస్థాన్‌లో ఉంటున్న కశ్మీర్ శరణార్థులకు కేటాయించడంపై స్థానికులు మండిపడుతున్నారు. తమ ప్రాంత భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికల్లో స్థానికులకు కాకుండా, బయట వ్యక్తులకు రిజర్వేషన్లు కల్పించడం వెనుక పాకిస్థాన్ కుట్ర ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. తమ స్వతంత్ర ప్రతిపత్తిని పూర్తిగా అణచివేసేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ పద్ధతిని తీసుకొచ్చిందని నిరసనకారులు విమర్శిస్తున్నారు. పీవోకేను తమ గుప్పిట్లో ఉంచుకునేందుకు పాక్ పాలకులు అనుసరిస్తున్న అడ్డదారులు ప్రజలలో ఆగ్రహావేశాలను నింపుతున్నాయి. నిరసనల ఉధృతిని చూసి అప్రమత్తమైన పాకిస్థాన్ ప్రభుత్వం, ప్రజా శాంతి భద్రతల పేరిట అవామీ యాక్షన్ కమిటీపై నిషేధం విధించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిరంకుశ చర్యతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. కమిటీపై నిషేధం తొలగించాలంటూ కార్యకర్తలు పదివేల సంఖ్యలో రోడ్లపైకి వచ్చి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తున్నారు. రావల్‌కోట్, బింబేర్, ముజఫరాబాద్ వంటి ప్రాంతాల్లో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. రోడ్లన్నీ సైనిక వాహనాలతో నిండిపోగా, సామాన్య ప్రజలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. పాక్ దళాలు రోడ్లపై కనిపిస్తున్న వారిపై సైతం కాల్పులు జరుపుతుండటం దారుణ పరిస్థితులకు అద్దం పడుతోంది. ప్రాంతీయంగా అభివృద్ధిని పక్కన పెట్టి, పాకిస్థాన్ కేవలం అధికారం కోసం మాత్రమే ప్రాకులాడుతోందని స్థానిక మేధావులు మండిపడుతున్నారు. నిరసనలు సాగుతున్న 10 ప్రధాన కేంద్రాల్లో ఇంటర్నెట్ సేవలను ప్రభుత్వం నిలిపివేసింది. సమాచార ప్రసారాలను అడ్డుకోవడం ద్వారా ఉద్యమాన్ని నీరుగార్చాలని పాలకులు భావిస్తున్నారు. అయితే, ప్రజల నిరసన ఉధృతిని చూస్తుంటే, వారి ఆగ్రహం ఏ స్థాయికి చేరుకుందో అర్థమవుతోంది. దశాబ్దాలుగా పాక్ ఆక్రమణలో మగ్గుతున్న ప్రజలు, ఇప్పుడు తమ హక్కుల కోసం చేసే పోరాటంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ ఉద్యమం మరింత బలపడే అవకాశం ఉంది. నిరసనకారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సుమారు 50,000 మంది కార్యకర్తలు ఇప్పటికే వివిధ పట్టణాల్లో నిరసనల్లో పాల్గొన్నారు. వీరికి స్థానిక యువత తోడవ్వడంతో ఆందోళనలు ఆపడం దళాలకు తలకు మించిన భారంగా మారుతోంది. మహిళలు, వృద్ధులు సైతం పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చి, తమ ప్రాంతంపై పాక్ ఆధిపత్యాన్ని నిరసిస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో ప్రజలు తిరుగుబాటు చేయడం, గత 50 ఏళ్ల చరిత్రలో ఎప్పుడూ చూడలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను నిరసనకారులు చుట్టుముట్టడంతో, అధికారులు విధులు నిర్వర్తించలేని పరిస్థితి ఏర్పడింది. పాకిస్థాన్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై అంతర్జాతీయ సమాజం సైతం ఆందోళన చెందుతోంది. మానవ హక్కుల సంఘాలు పీవోకేలో జరుగుతున్న అకృత్యాలపై దృష్టి సారించాయి. 30 మంది ప్రాణాలు తీయడం ద్వారా, ప్రభుత్వం తాను ఎటువంటి నియంతృత్వ వైఖరిని అవలంబిస్తుందో ప్రపంచానికి చాటిచెప్పింది. శాంతి చర్చల ద్వారా పరిష్కరించాల్సిన సమస్యలను, తుపాకీతో అణచివేయాలని చూస్తున్న పాక్ తీరును ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయి. ఈ ప్రాంతంలో నెలకొన్న అస్థిరత, పొరుగు దేశాలపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాక్ పాలకులు ఇప్పటికైనా దౌర్జన్యాలను ఆపి, ప్రజాస్వామ్యయుతంగా చర్చలకు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ఆర్థికంగా చితికిపోయిన పాకిస్థాన్‌కు, ఇప్పుడు ఈ కొత్త సమస్య మరో భారంగా పరిణమించింది. ఇప్పటికే 20 శాతానికి పైగా ఉన్న ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న పాక్ ప్రభుత్వం, ఇలాంటి ఘర్షణలతో అంతర్గత అశాంతిని కొనితెచ్చుకుంటోంది. పీవోకే ప్రజల ఆర్థిక పరిస్థితులు కూడా దయనీయంగా ఉన్నాయి. పన్నుల భారంతో ప్రజలు విసిగిపోయి ఉండగా, ప్రభుత్వం వారిపై దాడులకు దిగడం మంటల్లోకి ఆజ్యం పోసినట్లుగా ఉంది. కనీసం తాగునీరు, విద్యుత్ వంటి కనీస సదుపాయాలు లేని ప్రజలకు, పాక్ పాలకులు ఇచ్చే సమాధానం కాల్పులు మాత్రమేనా అని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయినా, దళాల కోసం వెచ్చించే నిధులు మాత్రం తగ్గడం లేదని వారు విమర్శిస్తున్నారు. నిరసనకారులు తమ డిమాండ్ల పట్ల రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో మార్పులు చేయకపోతే, ఎన్నికలను బహిష్కరిస్తామని వారు హెచ్చరిస్తున్నారు. కేవలం 12 స్థానాల రిజర్వేషన్ సమస్యే కాకుండా, మొత్తంగా ప్రాంతీయ స్వయం ప్రతిపత్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. పాక్ నియంత్రణ నుంచి తమను విముక్తులను చేయాలని వారు నినదిస్తున్నారు. 200 మంది గాయపడిన ఘటన తర్వాత, నిరసనలు మరింత ఉగ్రరూపం దాల్చాయి. దళాల కట్టడిని దాటుకుని ప్రజలు వీధుల్లోకి వస్తుండటం చూస్తుంటే, పాక్ ప్రభుత్వం పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం అసాధ్యంగా కనిపిస్తోంది. పాలకుల అహంకారం, దళాల మూర్ఖత్వం కలగలిసి పీవోకేలో అశాంతి రాజ్యమేలుతోంది. శాంతిని ఆకాంక్షించే ప్రజలపై యుద్ధం ప్రకటించినట్లు వ్యవహరిస్తున్న పాక్ ప్రభుత్వానికి, ప్రజల నిరసన ఒక హెచ్చరిక. రాబోయే రోజుల్లో కనీసం 1,00,000 మంది ప్రజలు వీధుల్లోకి వచ్చే అవకాశం ఉందని గూఢచారి వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో కాకుండా, అశాంతి వైపు పయనిస్తోంది. ఇప్పటికైనా పాక్ పాలకులు వాస్తవాన్ని గ్రహించి, కశ్మీర్ ప్రజల మనోభావాలను గౌరవించకపోతే, చరిత్ర క్షమించదు. బాధ్యతాయుతమైన ప్రభుత్వం అనిపించుకోవాలంటే, కాల్పులు ఆపి చర్చల ద్వారా సమస్య పరిష్కారం కోసం ప్రయత్నించాలి. లేనిపక్షంలో, ఈ అశాంతి పాక్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చే ప్రమాదం ఉంది.

# అంగన్‌వాడీల జీతాలు చెల్లించు

- 62 వేల మందికి రెండు నెలలుగా జీతాలు బంద్
- అంగన్‌వాడీల కష్టాలను మంత్రి పట్టించుకోవట్లేదు
- రూ.18 వేల జీతం హామీని కాంగ్రెస్ విస్మరించింది
- ఆందోళన చేస్తున్న మహిళలను పోలీసులు ఈడ్చుకెళ్లి అరెస్ట్ చేశారు
- మినీ అంగన్‌వాడీలకు ఏడాదిగా పెరిగిన వేతనాలు ఇవ్వలేదు
- పైసలు ఇవ్వకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ సమాజంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేస్తామంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రౌండ్ రియాలిటీలో మాత్రం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలకడం మానేసి ముందుగా క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమిస్తున్న అంగన్‌వాడీలకు బకాయి ఉన్న జీతాలు చెల్లించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో డిమాండ్ చేశారు. రెండు నెలల నుంచి వేతనాలు అందక పస్తులుంటూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62 వేల మంది అంగన్‌వాడీల కష్టాలు ప్రభుత్వ పెద్దలకు ఎందుకు కనిపించడం లేదని ఆయన నిలదీశారు. నెలల తరబడి కష్టార్జితాన్ని ఇవ్వకుండా అంగన్‌వాడీలను వేధిస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా బాధితుల శాపం తగులుతుందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఒక మహిళా మంత్రిగా ఉన్న సీతక్క సాటి మహిళల కన్నీటి గోసను, ఆవేదనను కనీసం అర్థం చేసుకోకపోవడం అత్యంత శోచనీయమని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. గత బీఆర్ఎస్ పాలనలో అంగన్‌వాడీల సేవలను గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వారిని కేవలం వర్కర్లుగా కాకుండా అంగన్‌వాడీ టీచర్లు అని పోస్టును ఉన్నతీకరించి సమాజంలో వారికి విపరీతమైన గౌరవాన్ని పెంచారని గుర్తు చేశారు. 2014 నాటికి అంగన్‌వాడీలకు కేవలం 4,200 రూపాయలు, సహాయకులకు 2,200 రూపాయల వేతనం మాత్రమే లభించేదన్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీల సంక్షేమం కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని భారీగా పెంచుతూ 13,650 రూపాయలకు చేర్చిందని హరీశ్‌రావు వివరించారు. అదేవిధంగా మినీ అంగన్ వాడీ టీచర్ల వేతనాన్ని 7,800 రూపాయలకు, అంగన్ వాడీ హెల్పర్ల వేతనాన్ని 7,800 రూపాయలకు పెంచి దేశంలోనే అత్యధికంగా గౌరవ వేతనం చెల్లించిన ఘనత తమదేనని గర్వంగా ప్రకటించారు. గత ఎన్నికల సమయంలో అభయహస్తం పేరిట కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని ఏకంగా 18,000 రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. దాంతోపాటు వారిని ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి పూర్తి ఉద్యోగ భద్రత కల్పిస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు ఓట్ల కోసం అరచేతిలో వైకుంఠం చూపించి, అధికార పీఠం ఎక్కాక నిత్యం అబద్ధాలు ప్రచారం చేసుకోవడమే కాంగ్రెస్ వైఖరిగా మారిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఛలో సెక్రెటేరియట్ పిలుపునిచ్చిన అంగన్‌వాడీలపై ప్రభుత్వం పోలీసులను ప్రయోగించిందని మండిపడ్డారు. మహిళలని కూడా చూడకుండా రోడ్లపై ఈడ్చుకెళ్తూ కర్కశంగా వ్యవహరించిన దుర్మార్గమైన చరిత్ర ఈ రేవంత్ ప్రభుత్వానికే దక్కుతుందని మండిపడ్డారు. ఇప్పటికైనా పాలకులు తమ అహంకారాన్ని వీడి కళ్లు తెరవాలని, ప్రస్తుత కాంగ్రెస్ తుగ్లక్ పాలనను రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు అసహ్యించుకుంటున్నారన్న నిజాన్ని గ్రహించాలని హితవు పలికారు. రెండు నెలలుగా పెండింగ్‌లో ఉంచిన అంగన్‌వాడీల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీటితో పాటు అప్‌గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీలకు దాదాపు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న పెంచిన వేతనాల బకాయిలను సైతం ఒక్క రూపాయి కూడా కట్ చేయకుండా వెంటనే చెల్లించాలన్నారు. లేనిపక్షంలో అంగన్‌వాడీల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటాలకు దిగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణ కూడా భారంగా మారిందని, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించే వ్యవస్థలను ఇలా నిర్వీర్యం చేయడం పాలకుల అనాలోచిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. సచివాలయం ముట్టడికి వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేయడం, పోలీస్ స్టేషన్లకు తరలించడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వం వారి గొంతు నొక్కాలని చూస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. హక్కుల కోసం పోరాడే వారిని అణచివేయాలని చూడడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే మాటలకు, చేసే పనులకు ఎక్కడా పొంతన లేదనే విషయం ఈ రెండున్నరేండ్ల పాలనలోనే స్పష్టమైందని ప్రజలు భావిస్తున్నారు. మహిళా సాధికారత గురించి మైకుల ముందు స్పీచులు ఇచ్చే నాయకులు, క్షేత్రస్థాయిలో మహిళా ఉద్యోగులు పడుతున్న నరకయాతనను చూడలేకపోవడం వారి ద్వంద్వ విధానాలకు అద్దం పడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 62 వేల మంది అంగన్‌వాడీ సిబ్బంది కుటుంబాలు ఈ రోజు జీతాలు లేక అద్దెలు కట్టలేక, నిత్యావసర వస్తువులు కొనలేక అల్లాడిపోతున్నాయని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో చలనం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. కేసీఆర్ హయాంలో ప్రతి నెలా ఒకటో తేదీనే అంగన్ వాడీల ఖాతాల్లో జీతాలు జమ అయ్యేవని, ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో జీతాల కోసం నెలల తరబడి రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. హామీల అమలులో కాలయాపన చేస్తూ కాలం గడుపుతున్న ఈ సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయని ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారని స్పష్టం చేశారు. ఇంటర్‌బ్రాండ్ సర్వేల తరహాలోనే ప్రభుత్వాల పనితీరుపై కూడా ప్రజలు నిరంతరం నిఘా ఉంచుతారనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మర్చిపోవద్దని హరీశ్‌రావు సూచించారు. అంగన్‌వాడీలకు కనీస ఈపీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి ఇప్పుడు వారిని రోడ్డున పడేయడం నమ్మకద్రోహమే అవుతుందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తూ సొంత పబ్లిసిటీ కోసం వందల కోట్లు ఖర్చు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, పేద మహిళలకు ఇచ్చేందుకు బడ్జెట్ దొరకకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మినీ అంగన్‌వాడీల అప్‌గ్రేడేషన్ ప్రక్రియను కేవలం కాగితాలకే పరిమితం చేసి, వారికి రావలసిన పెంచిన వేతనాలను ఏడాదిగా తొక్కేయడం వెనుక ఉన్న అంతర్యమేమిటో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# యూరియా రాదు.. పంట కొనరు

**మొదటిపేజీ తరువాయి**

కోటిన్నర ఎకరాల సాగుభూమి అందుబాటులో ఉంది. సుమారు 70 లక్షల మందికి పైగా రైతుల పేరిట పట్టా పాస్ బుక్ లు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. వీరంతా ప్రభుత్వ పెట్టుబడి సాయాన్ని నిరంతరాయంగా పొందుతున్నారు. కాగా 36 శాతం మంది అంటే సుమారు 22 లక్షల మంది రైతులు భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నట్టు 2022లో రైతు స్వరాజ్య నివేదిక చేసిన సర్వేలో స్పష్టమైంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే కౌలు భూమిని నమ్ముకున్న వారిలో 47.2 శాతం బీసీలు, 26.9 శాతం ఎస్సీలు, 13.9 శాతం ఎస్టీలు, 4.2 శాతం ముస్లింలు, 7.5 శాతం ఓసీ సామాజిక వర్గాలు ఉన్నారు. ప్రస్తుత రోజుల్లో కౌలు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. గరిష్టంగా ఎకరాకు 53వేల రూపాయలకు చేరగా, సగటున ఎకరాకు 14,936 రూపాయలుగా నమోదైంది. 2022లో సగటున కౌలు భూమి విస్తీర్ణం 5 ఎకరాలుగా ఉండగా అది ఇప్పుడు ఏకంగా 6.7 ఎకరాలకు పెరిగింది. ఎకరాకు వచ్చే నికర ఆదాయం క్రమంగా తగ్గిపోతుండడం వల్లే కౌలు రైతులు అదనంగా భూమిని కౌలుకు తీసుకొని సాగును విస్తరిస్తున్నారు. గత యాసంగి సీజన్ లో అధికారులు ప్రవేశపెట్టిన కొత్త యాప్ ఆధారిత విధానం కౌలు రైతులకు శాపంగా మారింది. దీని వల్ల కౌలు రైతులకు సబ్సిడీ యూరియా దొరకకుండా పోయింది. ఈ కొత్త యాప్ లో భూయజమాని రిజిస్టర్డ్ ఫోన్ నంబర్ కు వచ్చే ఓటీపీని తప్పనిసరి చేశారు. ఫలితంగా నాలుగో వంతు కౌలు రైతులు మాత్రమే ఎలాగోలా యూరియా సబ్సిడీని పొందగలుగుతున్నారు. ఒకవైపు సబ్సిడీ యూరియా అందుకున్న భూ యజమానులు వాటిని అసలైన కౌలు రైతులకు సకాలంలో ఇవ్వడం లేదు. ఈ కారణం చేత వారు బహిరంగ మార్కెట్లో దళారులను ఆశ్రయించి బ్లాక్ లో రెట్టింపు ధరలకు యూరియాను కొనాల్సి వస్తున్నది. పెట్టుబడి వ్యయం పెరిగిపోవడానికి ఇదొక ప్రధాన కారణంగా మారుతోంది. మరోవైపు పండించిన పంటను మార్కెట్లలో అమ్ముకోవడంలోనూ ఇలాంటి సాంకేతిక అవరోధాలే రైతులకు ఎదురవుతున్నాయి. పత్తి, వరి వంటి ప్రధాన పంటలను ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేసేందుకు భూ యజమాని ఫోన్‌కు వచ్చే ఓటీపీ తప్పనిసరి కావడంతో గందరగోళం నెలకొంది. దీంతో కౌలు రైతులు తాము రాత్రింబవళ్లు కష్టపడి పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడం అతి కష్టంగా మారింది. తాజా సర్వే నివేదిక ప్రకారం కేవలం 6.7 శాతం కౌలు రైతులు మాత్రమే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు తమ పత్తిని అమ్ముకోగలిగారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్ లో కేవలం 20 శాతం మంది కౌలు రైతులు మాత్రమే వరి ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించగలిగారు. భూయజమాని ఓటీపీ నిబంధన వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్న కౌలు రైతులు విధిలేక స్థానిక ఏజెంట్లకు 10వేల రూపాయల వరకు కమీషన్ చెల్లించుకొని పంటను వదిలించుకోవాల్సి వచ్చింది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కౌలు రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. సర్వే నివేదిక ప్రకారం అకాల వరదలు, భారీ వర్షాలు, వడగండ్ల వానల వల్ల 85 శాతం కౌలు రైతులు తీవ్రమైన పంట నష్టాన్ని చవిచూశారు. ఇంత భారీ స్థాయిలో నష్టం వాటిల్లినప్పటికీ వారిలో కేవలం 0.7 శాతం మందికి మాత్రమే ప్రభుత్వ పంట నష్ట పరిహారం అందింది. భూమి రికార్డులు యజమానుల పేరిట ఉండడం వల్ల చాలా మంది భూ యజమానులే ఈ పరిహార సొమ్మును బ్యాంకు ఖాతాల్లో అందుకున్నారు. నిబంధనల ప్రకారం ఆ మొత్తాన్ని నిజంగా నష్టపోయిన కౌలు రైతులకు అందించలేదు. దీనికితోడు భూ యజమానులకు సున్నా వడ్డీకే సులభంగా లభించే బ్యాంకు పంట రుణాలు కౌలు రైతులకు అసలే లభించడం లేదు. దీంతో వారు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వలల్లో చిక్కుకుంటున్నారు. రాష్ట్రంలో అమల్లో ఉన్న 2011 కౌలు రైతుల చట్టం ప్రకారం అర్హులైన కౌలు రైతులందరికీ అధికారికంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలి. కానీ ఆ చట్టం ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదు. కౌలు రైతులకు చట్టబద్ధమైన గుర్తింపు కార్డు లేకపోవడంతో వారికి లభించాల్సిన సబ్సిడీ యూరియా దక్కడం లేదు. బ్యాంకుల నుండి ఆశించిన వడ్డీ లేని రుణాలు అందడం లేదు. ప్రభుత్వ లబ్ధిదారుల జాబితాలో వారి పేర్లు నమోదు కాకపోవడంతో పంటను అమ్ముకునే పరిస్థితి లేదు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేసే రైతు భరోసా, పంట నష్ట పరిహారం వంటివన్నీ నేరుగా భూ యజమానుల ఖాతాలోకే వెళ్తున్నాయి. దీనివల్ల అటు పెట్టుబడి సాయం అందక, ఇటు సబ్సిడీ పథకాలు వర్తించక కౌలు రైతులకు జరుగుతున్న ఆర్థిక నష్టం అంతా ఇంతా కాదు. తెలంగాణ ప్రభుత్వం ఏటా రైతు సంక్షేమం కోసం, వ్యవసాయ మద్దతు కోసం బడ్జెట్‌లో దాదాపు 25వేల కోట్ల రూపాయల భారీ మొత్తాన్ని ఖర్చు చేస్తున్నది. అయితే ఈ నిధులు అధిక శాతం కేవలం భూ యజమానులకే అందుతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. రాత్రింబవళ్లు కష్టపడి నిజంగా సాగు చేస్తున్న కౌలు రైతులు ఎలాంటి ప్రభుత్వ సాయం అందక అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. ఆ ఆర్థిక భారాన్ని మోయలేక చివరకు ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలకు పాల్పడుతున్నారు. ఈ వినాశకర పరిస్థితులకు అడ్డుకట్ట వేయాలంటే కౌలు రైతులకు తక్షణమే గుర్తింపు కార్డులను అందజేయాలి. వారికి సాగు సంబంధిత ప్రభుత్వ పథకాలను నేరుగా అమలు చేయడంతోనే ఈ దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కమిటీ నివేదిక బలంగా పేర్కొన్నది. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా వ్యవసాయ విధానాల్లో మార్పులు రావలసిన అవసరం ఎంతైనా ఉంది. డిజిటలైజేషన్ పేరుతో ప్రవేశపెడుతున్న ఓటీపీ విధానాలు క్షేత్రస్థాయిలో దుర్వినియోగం కాకుండా చూడాలి. భూమి లేకపోయినా కష్టపడే తత్వమే పెట్టుబడిగా సాగు చేస్తున్న కౌలు రైతుకు గుర్తింపు లభించినప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. కేవలం యజమానులకే కాకుండా వాస్తవంగా పొలంలో చెమటోడుస్తున్న ప్రతి చేతికి సాయం అందడమే నిజమైన సంక్షేమం అనిపించుకుంటుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టే స్మార్ట్ యాప్‌లు రైతులకు మేలు చేసేలా ఉండాలి తప్ప వారి అవకాశాలను దెబ్బతీసేలా ఉండకూడదు.



# ధాన్యం సేకరణలో తెలంగాణే టాప్




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రస్తుత యాసంగి సీజన్లో ఎవరూ ఊహించని రీతిలో, ఆల్ఇండియా లెవెల్లో అత్యధికంగా ధాన్యం కొనుగోళ్లు జరిపి సరికొత్త బెంచ్‌మార్క్ సెట్ చేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అనౌన్స్ చేశారు. ఈ బిగ్గెస్ట్ కొనుగోళ్లకు సంబంధించి ఏకంగా 35077 కోట్ల రూపాయల భారీ మొత్తాన్ని డైరెక్ట్‌గా అన్నదాతల బ్యాంక్ ఖాతాల్లో క్రెడిట్ చేసినట్లు పేర్కొన్నారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్ మోడ్ ద్వారా ఎలాంటి ఇల్లీగల్ యాక్టివిటీస్‌కు ఛాన్స్ లేకుండా అత్యంత పారదర్శకంగా ఈ నిధులను రైతుల అకౌంట్లలోకి పంపించామన్నారు. దేశం మొత్తం మీద పండే వరి పంటలో హయ్యస్ట్‌గా 61 శాతం వాటా కేవలం తెలంగాణ నుంచే వస్తోందని ఈ అఫీషియల్ స్టాటిస్టిక్స్ చెబుతున్నాయని ఆయన ఫుల్ హ్యాపీనెస్ ఎక్స్‌ప్రెస్ చేశారు. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ రూలింగ్‌తో కంపేర్ చేస్తే తమ 2 ఏళ్ల పాలనలోనే రైతులకు అందిస్తున్న ఫైనాన్షియల్ సపోర్ట్ నెక్స్ట్ లెవెల్‌కు చేరిందని మంత్రి పక్కా డేటాతో సహా ఎక్స్‌ప్లెయిన్ చేశారు. మునుపటి ప్రభుత్వం 10 ఏళ్ల టైమ్ పీరియడ్‌లో రైతులకు కేవలం 1.35 లక్షల కోట్ల రూపాయలు మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. తాము పవర్‌లోకి వచ్చిన కేవలం 2 ఏళ్ల షార్ట్ పీరియడ్‌లోనే రైతాంగానికి ఏకంగా 1 లక్ష కోట్ల రూపాయల బెనిఫిట్ చేకూర్చామని స్పష్టం చేశారు. ఈ రియల్ అంకెలే తమ ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న అంకితభావాన్ని, వారి అప్‌లిఫ్ట్‌మెంట్‌కు ఇస్తున్న ప్రయారిటీని క్లియర్ కట్‌గా నిరూపిస్తున్నాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం గ్రౌండ్ లెవెల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లపై అపోజిషన్ పార్టీలు కావాలనే పొలిటికల్ మైలేజ్ కోసం బురదజల్లే రాజకీయం చేస్తున్నాయని ఉత్తమ్ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ప్రభుత్వంపై ప్రజల్లో, రైతుల్లో నెగెటివిటీ క్రియేట్ చేసేందుకు ఫేక్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. క్షేత్రస్థాయి వాస్తవాలు కంప్లీట్‌గా వేరేలా ఉన్నాయని, కొనుగోళ్లు అత్యంత స్పీడ్‌గా సాగుతున్నాయని చెప్పారు. విపక్షాల అసత్య ప్రచారాలను రైతులు అస్సలు నమ్మే పరిస్థితిలో లేరని, ప్రభుత్వ యాక్షన్స్ పట్ల అన్నదాతలు పూర్తి సాటిస్ఫాక్షన్‌తో ఉన్నారని ఆయన వెల్లడించారు. రైతులకు ఎలాంటి ప్రాబ్లమ్స్ రాకుండా ఉండేందుకు ఈ యాసంగి సీజన్లో రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 8575 కొనుగోలు కేంద్రాలను ఎస్టాబ్లిష్ చేసినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ సీజన్‌కు గాను తెలంగాణ నుంచి కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను మాత్రమే టార్గెట్‌గా ఫిక్స్ చేసిందని గుర్తు చేశారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం రైతులు లాస్ కాకూడదనే గుడ్ ఇంటెన్షన్‌తో సెంట్రల్ గవర్నమెంట్ టార్గెట్‌ను క్రాస్ చేసి ఇప్పటివరకు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సక్సెస్‌ఫుల్‌గా కలెక్ట్ చేసిందని వివరించారు. దేశంలో ఎకనామికల్గా స్ట్రాంగ్‌గా ఉన్న పెద్ద పెద్ద రాష్ట్రాల్లో సైతం తెలంగాణ తరహాలో ఇంత హ్యూజ్ క్వాంటిటీలో ధాన్యం సేకరణ జరగలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. ఇతర రాష్ట్రాలతో కంపేర్ చేస్తే తెలంగాణలోనే అగ్రికల్చర్ సెక్టార్ అత్యంత వైబ్రంట్‌గా, యాక్టివ్‌గా ఉందనడానికి ఈ రికార్డ్ కొనుగోళ్లే పక్కా ఎవిడెన్స్ అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పెద్దలు ఇక్కడి రైతుల హార్డ్‌వర్క్‌ను రికగ్నైజ్ చేయాల్సింది పోయి పాలిటిక్స్ చేయడం కరెక్ట్ కాదన్నారు. వ్యవసాయ రంగాన్ని ప్రాఫిటబుల్ జోన్‌లోకి మార్చడమే తమ ప్రభుత్వ అల్టిమేట్ ఎయిమ్ అని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కొన్ని రాంగ్ పాలసీల వల్ల రాష్ట్ర రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా తెలంగాణ నుంచి సేకరించాల్సిన ధాన్యం కోటాను కేంద్రం గ్రాడ్యువల్‌గా తగ్గించుకుంటూ రావడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఈ రకమైన నెగెటివ్ ధోరణి వల్ల దేశానికి అన్నం పెట్టే రాష్ట్ర రైతాంగం మోరల్ స్ట్రెంత్ దెబ్బతినే డేంజర్ ఉందన్నారు. కేంద్రం తన పట్టుదలను వదిలేసి తెలంగాణకు బ్యాక్‌బోన్‌గా నిలవాల్సిన క్రూషియల్ సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా, రైతుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ధాన్యం సేకరణ కోటాను ఇమ్మీడియట్‌గా పెంచాల్సిన అవసరం ఉందని ఉత్తమ్ డిమాండ్ చేశారు. ఇక్కడి భూములు పండించే క్వాలిటీ ధాన్యానికి నేషనల్ లెవెల్లో సూపర్ డిమాండ్ ఉందని, దానికి తగ్గట్లుగా కేంద్రం తన ప్రొక్యూర్మెంట్ స్ట్రాటజీని మార్చుకోవాలన్నారు. రాష్ట్రం నుంచి వచ్చే ప్రతి గింజనూ పర్చేజ్ చేసేందుకు తాము రెడీగా ఉన్నామని, కేంద్రం కూడా దీనికి ఫుల్ సపోర్ట్ ఇవ్వాలని కోరారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా మార్చడంలో ఇక్కడి రైతుల శ్రమ వాల్యూబుల్ అని మంత్రి కొనియాడారు. ఎంతటి టఫ్ సిట్యుయేషన్స్ ఎదురైనా అగ్రికల్చర్ సెక్టార్‌కు ఇరిగేషన్ నీటి సరఫరా, నిరంతర కరెంట్, సకాలంలో పెట్టుబడి సాయం అందిస్తూ రైతులను రాజును చేయడమే తమ టాప్ ప్రయారిటీ అని స్పష్టం చేశారు. ఫ్యూచర్‌లోనూ ఇలాంటి మరిన్ని బిగ్ రికార్డులను క్రియేట్ చేస్తూ తెలంగాణ అగ్రికల్చర్ ప్రొఫైల్‌ను గ్లోబల్ లెవెల్‌కు తీసుకువెళతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫుల్ కాన్ఫిడెన్స్ వ్యక్తం చేశారు

# బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ప్రాంతంలో సాగునీటితోపాటు ఇతర అభివృద్ధి ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నట్లు నిరూపిస్తే తన పదవికి తక్షణమే రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మంగళవారం దేశ రాజధాని న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ అధికార పక్షం చేస్తున్న విమర్శలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న రాజకీయ బెదిరింపులకు తాను ఎంతమాత్రం భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సానుకూలంగానే ఉందని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేలా పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి కనీస స్థాయిని మరిచి మాట్లాడటం సరికాదంటూ రేవంత్ రెడ్డి రాజకీయ శైలిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలాగా తాను పూటకో మాట మాట్లాడే చతురత కలిగిన మాటకారిని కాకపోయినా ఇచ్చిన మాటపై నిలబడే నైజం ఉన్న వ్యక్తినని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. రాజకీయాల్లో పదవులు, అధికారం కోసం సిద్ధాంతాలను వదిలేసి అడ్డగోలుగా మాటలు మార్చే రకం తాను కాదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించడమే తన నైజమని, ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం తనకు మొదటి నుండి అలవాటు లేదన్నారు. తెలంగాణ సమాజం అంతా తన రాజకీయ ప్రస్థానాన్ని, నిజాయితీని గమనిస్తోందని చెప్పారు. కేవలం రాజకీయ ఉనికి కోసమే కాంగ్రెస్ నేతలు తనపై అభాండాలు వేస్తున్నారని ఆరోపించారు. ఒక కేంద్ర మంత్రిగా రాష్ట్రానికి రావాల్సిన అన్ని నిధులను, ప్రాజెక్టులను సకాలంలో తీసుకురావడానికి తాను నిరంతరం కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలపై, ఇతర హామీలపై ఎక్కడైనా, ఏ సమయమైనా తాను చర్చకు సిద్ధమని అధికార పార్టీ అగ్రనేతలకు కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన ఏ ఒక్క గ్యారంటీనైనా రాష్ట్రంలో సంపూర్ణంగా అమలు చేశారా? అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఒకప్పుడు దేశంలోనే అత్యంత ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి అప్పుల ఊబిలోకి నెట్టేశాయని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రజాధనాన్ని దోచుకోవడం, దాచుకోవడం, అధికారంలోకి వచ్చాక ప్రజలను వంచించడంలో అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ పార్టీలు రెండూ దొందూ దొందేనని తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ రెండు పార్టీల తీరు వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నప్పటికీ ఇక్కడి సామాన్య ప్రజల బతుకులు మాత్రం ఇంకా మారలేదంటూ కిషన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల బాటలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నడుస్తోందని విమర్శించారు. కేవలం అప్పులు తెచ్చి సోకులు చేయడమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ సర్కార్, ప్రస్తుత రేవంత్ సర్కార్ వ్యవహరిస్తున్నాయని తీరును ఎండగట్టారు. పాలకులు మారినా పాలన మారలేదని, ప్రజలపై పన్నుల భారం మోపుతూ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమస్యల కంటే స్వరాష్ట్రంలో పాలనాపరమైన లోపాలు మరీ ఎక్కువయ్యాయని విమర్శించారు. తెలంగాణ సంపదను ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేయకుండా కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో భవిష్యత్తులో ప్రభుత్వ భూములు మిగిలే పరిస్థితి అస్సలు కనిపించడం లేదని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని ముఖ్యులు, మంత్రులతోపాటు కీలక నేతలందరూ భూ దోపిడీకి పాల్పడుతున్నారని సంచలన విమర్శలు చేశారు. అధికార బలాన్ని అడ్డం పెట్టుకుని విలువైన భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత పాలకుల అనాలోచిత విధానాల వల్ల హైదరాబాద్ నగరంలో అత్యంత కీలకమైన రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుదేలయ్యిందని చెప్పారు. నిర్మాణ రంగం నమ్ముకున్న వేలాది మంది కార్మికులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. కొత్త ప్రాజెక్టులు రాకపోవడంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని, నగర ప్రతిష్ట అంతర్జాతీయ స్థాయిలో మసకబారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక క్రమశిక్షణ పూర్తిగా తప్పిందని, కనీసం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు ఇచ్చే పరిస్థితి కూడా ప్రస్తుత ప్రభుత్వానికి లేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ జీతాల కోసం ప్రతినెలా ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా కేవలం అప్పుల మీదే ఆధారపడుతున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాలకు సైతం నిధుల కొరత వేధిస్తోందని చెప్పారు.

# సింగరేణిలో మళ్లీ సమ్మె

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణ ఆర్థిక చోదక శక్తిగా విరాజిల్లుతున్న సింగరేణి బొగ్గు గనుల్లో మళ్లీ సమ్మె సైరన్ మోగింది. కార్మిక లోకం తమ హక్కుల సాధన కోసం ఉప్పెనలా కదలివచ్చేందుకు సమరశంఖం పూరిస్తోంది. సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా మారిన తమ ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ నల్లబంగారు గని కార్మికులు యాజమాన్యానికి అల్టిమేటం జారీ చేశారు. కార్మిక పక్షపాతిగా పేరుగాంచిన ప్రముఖ కార్మిక సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులు ఈ సమ్మె సన్నాహాలకు సారథ్యం వహిస్తున్నారు. ఈ మేరకు కార్మిక సంఘం ప్రతినిధుల బృందం సంస్థ ఉన్నతాధికారులను కలిసి తమ ఆవేదనను, ఆగ్రహాన్ని నిరసన పత్రం రూపంలో అందజేసింది. యాజమాన్యం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి నశించాలంటూ ఈ సందర్భంగా కార్మికులు నినదించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లతో కూడిన అధికారిక సమ్మె నోటీసును సింగరేణి జనరల్ మేనేజర్ కవితా నాయుడుకు ఏఐటీయూసీ నాయకులు సమర్పించారు. సంస్థ మనుగడకు అత్యంత కీలకమైన నూతన గనుల ఏర్పాటుతో పాటు కార్మికుల సొంతింటి కల నెరవేర్చడం వంటి అనేక అంశాలను ఇందులో ప్రధానంగా పొందుపరిచారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్‌కో నుంచి సింగరేణికి సుదీర్ఘ కాలంగా రావాల్సిన 56 వేల కోట్ల రూపాయల భారీ బకాయిలను వెంటనే విడుదల చేయించాలనే డిమాండ్ ఈ నోటీసులో తలమానికంగా నిలిచింది. మొత్తం 30 ప్రధాన డిమాండ్లతో కూడిన ఈ సమగ్ర నోటీసుపై యాజమాన్యం స్పందించే తీరును బట్టి తదుపరి కార్యాచరణ ఉంటుందని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి. జూన్ నెలలోగా ఈ డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోకపోతే జూలై మాసంలో సింగరేణి వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని కార్మికులు హెచ్చరించారు. సింగరేణి సంస్థ భవిష్యత్తుకు అత్యంత ఆవశ్యకమైన నూతన గనుల ఏర్పాటు అంశంపై కార్మిక సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గత 12 ఏళ్లుగా సంస్థ పరిధిలో కొత్త గనులు రాకపోవడం వల్ల ఉత్పత్తి ప్రక్రియ తీవ్రంగా దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పాత యంత్రాలతోనే ప్రాణాలకు తెగించి కార్మికులు పనిచేయాల్సి వస్తోందని గుర్తు చేశారు. కాలంచెల్లిన సాంకేతికతతో ప్రమాదాలు పొంచి ఉన్నందున తక్షణమే కొత్త భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కొత్త గనుల ఏర్పాటు ద్వారానే సంస్థ మనుగడ సాధ్యమవుతుందని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కార్మిక నాయకులు బలంగా నొక్కి చెప్పారు. దశాబ్దాలుగా భూగర్భంలో చెమటోడ్చి నల్ల బంగారాన్ని వెలికితీస్తున్న కార్మికుల సొంతింటి కలను నెరవేర్చడంలో యాజమాన్యం విఫలమైందని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. సంస్థ పరిధిలో రేయింబగళ్లు శ్రమిస్తున్న కార్మికులందరికీ సొంత ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. నిధుల కేటాయింపు సాధ్యం కాని పక్షంలో ఇళ్ల స్థలాలనైనా కేటాయించి కార్మికులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికుడికి కనీస నివాస వసతి కల్పించడం సంస్థ ప్రాథమిక బాధ్యతని గుర్తు చేశారు. ఈ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించడంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గనుల్లో నిరంతరం కఠినమైన వాతావరణంలో పనిచేయడం వల్ల కార్మికులు అనేక రకాల అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. గతంలో ఇలాంటి అస్వస్థతకు గురైన కార్మికుల సంరక్షణ కోసం వైద్య పరీక్షలు నిర్వహించే మెడికల్ బోర్డులు అందుబాటులో ఉండేవి. దురదృష్టవశాత్తు కొంతకాలంగా నిలిచిపోయిన ఈ మెడికల్ బోర్డుల ప్రక్రియను వెంటనే పునఃప్రారంభించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు ఈ బోర్డు ద్వారా తగిన ఉపశమనం లభిస్తుందని, వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించే వీలుంటుందని తెలిపారు. వైద్య సేవలను పునరుద్ధరించడం ద్వారా కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపవచ్చని వారు ఆశావహ దృక్పథాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ జెన్‌కో నుంచి సింగరేణి సంస్థకు అందాల్సిన విద్యుత్ బకాయిల వ్యవహారం ఇప్పుడు సంస్థ ఆర్థిక పరిస్థితిని కుదిపేస్తోంది. సింగరేణి సరఫరా చేసిన బొగ్గుకు బదులుగా రావాల్సిన 56 వేల కోట్ల రూపాయల భారీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని వెంటనే ఇప్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ భారీ బకాయిల కారణంగా సంస్థ నూతన ప్రాజెక్టుల విస్తరణ, కార్మిక సంక్షేమ కార్యక్రమాలు కుంటుపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ఈ నిధులను విడుదల చేయిస్తేనే సింగరేణి ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కుతుందని కార్మిక పక్షాలు గళమెత్తాయి. సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందనే విషయాన్ని గుర్తు చేశారు. సంస్థలో దశాబ్దాలుగా కొనసాగుతున్న కాంట్రాక్టు కార్మికుల శ్రమ దోపిడీకి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి. సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న కాంట్రాక్టు కార్మికులను తక్షణమే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం అనే సూత్రాన్ని సింగరేణిలో కచ్చితంగా అమలు చేయాలని కోరారు.



## ఘనంగా ముగిసిన శ్రీ సుదర్శన మహా మంత్ర హోమం

**11 రోజుల మహా క్రతువుకు భక్తుల విశేష స్పందన.. లోకక్షేమం కోసం మహా సంకల్పం**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** లోకక్షేమం, విశ్వశాంతి సాధన లక్ష్యంగా ముచ్చింతల్‌లోని సమతామూర్తి కేంద్రంలో నిర్వహించిన శ్రీ సుదర్శన మహా మంత్ర హోమం మంగళవారం ఘనంగా ముగిసింది. 11 రోజుల పాటు వైభవంగా సాగిన ఈ మహా క్రతువుకు దేశవ్యాప్తంగా భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ముగింపు రోజున సమతామూర్తి ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. చివరి రోజు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక ఉత్సాహంతో కొనసాగాయి. ఈ మహోత్సవం శ్రీ అహోబిల రామానుజ జీయర్ స్వామీజీ, శ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామీజీ, శ్రీ రంగరామానుజాచార్య స్వామీజీల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. స్వామీజీలు తమ దివ్య మంగళాశాసనాలతో హోమ విశిష్టతను భక్తులకు వివరించారు. లోక కల్యాణం కోసం సుదర్శన మహామంత్ర జపం ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం భక్తులందరికీ పూర్ణకుంభ ప్రోక్షణ నిర్వహించారు. ముగింపు వేడుకల్లో మైహోమ్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు, వారి ధర్మపత్నితో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమ గుండంలో పూర్ణాహుతి సమర్పించి స్వామీజీల ఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ 11 రోజుల మహా యజ్ఞంలో భక్తులు ప్రత్యక్షంగా పాల్గొనడమే కాకుండా, డిజిటల్ మాధ్యమాల ద్వారా కూడా విస్తృతంగా భాగస్వామ్యం అయ్యారు. సాంకేతికత సహాయంతో ఈ కార్యక్రమం మరింత మంది భక్తులకు చేరువైంది. మొత్తంగా, ఈ మహా హోమం భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వ భావాలను బలపరిచిందని నిర్వాహకులు తెలిపారు.

## అత్తపూర్‌లో దొంగతనాల గుట్టు రట్టు

**యువకుడు అరెస్ట్, బంగారం స్వాధీనం**






**రాజేంద్రనగర్, విశాలభారతి:** అత్తపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన గృహభేదన, దొంగతనాల కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో నిందితుడైన రిషబ్ శుక్లా (21)ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, తేజస్వినీ నగర్‌లో రాత్రి సమయంలో గృహంలో చొరబడి బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించిన ఘటనపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో జూన్ 9, 2026 ఉదయం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతను పలు దొంగతనాల్లో తన ప్రమేయాన్ని అంగీకరించినట్లు వెల్లడైంది. నిందితుడి వద్ద నుంచి సుమారు 20.510 గ్రాముల బంగారు గొలుసు, రెండు బ్రేస్‌లెట్లు, లాకెట్, ఉంగరాలు, వెండి బిస్కెట్లు, వెండి గ్లాస్, ప్లేట్లు, బౌల్ తదితర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, వస్తువుల మొత్తం విలువ లక్షల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అలాగే హైదర్‌గూడ, న్యూ ఫ్రెండ్స్ కాలనీ ప్రాంతాల్లో జరిగిన ఇతర దొంగతనాల్లో కూడా అతని ప్రమేయం ఉన్నట్లు విచారణలో బయటపడింది. ఈ నేరాలకు పాల్పడేందుకు నిందితుడు పలుమార్లు బలెనో కారును అద్దెకు తీసుకుని రాత్రి వేళల్లో సంచరించి లక్ష్యంగా పెట్టుకున్న ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో దొంగతనానికి యత్నించిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ కేసును అత్త పూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఇన్‌స్పెక్టర్ కె. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ టి. శ్రీనివాస్ పర్యవేక్షణలో, డీసీపీ శ్రీనివాస్ ఐపీఎస్ మార్గదర్శకత్వంలో ఛేదించారు. కేసు ఛేదనలో పాల్గొన్న పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు పై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని, మరికొన్ని కేసులు బయటపడే అవకాశముందని పోలీసులు తెలిపారు.

## లారీ డ్రైవర్ గౌస్‌ను ఎన్కౌంటర్ చేయాలి

**బిజెపి రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి..**



**సికింద్రాబాద్, విశాలభారతి :** జిల్లా కేంద్రంలోని రాపర్తినగర్ కు చెందిన 12 సంవత్సరాల రజక ఆడబిడ్డపై అత్యాచారం జరిపి మూడంతస్తుల బిల్డింగ్ పైనుండి తోసేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన లారీ డ్రైవర్ గౌస్ ను వెంటనే ఎన్కౌంటర్ చేయాలని బిజెపి రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెట్టుగూడలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ అన్యం పుణ్యం ఎరుగని 12 ఏళ్ల పసిపాపపై అత్యాచారం చేయడానికి మనసెలా వచ్చిందని వాడు మనిషి కాదని మనిషి ముసుగులో ఉన్న మానవ మృగం అని అన్నారు. ఈనెల ఆరవ తారీఖున అత్యాచారం జరిగితే విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడం దురదృష్టకరమని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను అబాసుపాలు చేయడానికి తన కుమారుడు బండి భగీరథ్ ను ఫోక్సో కేసులో ఇరికించి నానా యాగి చేసిన కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ విషయమై ఎందుకు స్పందించడం లేదని అన్నారు. బండి భగీరథ్ కేసులో భగీరథ హిందూ కావడమే ఆయన చేసుకున్న పాపమా అని ఖమ్మంలో జరిగిన పోక్సో కేసులో నిందితుడు ముస్లిం మతానికి చెందిన వాడు కాబట్టి కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు నోరు మెదపడం లేదా అని ప్రశ్నించారు. ఈ విషయమై ప్రభుత్వం వెంటనే స్పందించి లారీ డ్రైవర్ గౌస్ ను వెంటనే ఎన్కౌంటర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## భవన నిర్మాణ కార్మికులను కించపరచడం సరికాదు

- **మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్**
- **కార్మికుల న్యాయపోరాటానికి మద్దతు కోరిన భవన నిర్మాణ కార్మిక సంఘం**




**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** భవన నిర్మాణ కార్మికుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కొందరు సెంట్రింగ్ కాంట్రాక్టర్లు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ ను కార్మిక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ.. రెక్కాడితే గానీ డొక్కాడని భవన నిర్మాణ కార్మికులను తక్కువ చేసి మాట్లాడటం సమంజసం కాదన్నారు. కష్టపడి శ్రమించి సమాజ అభివృద్ధికి తోడ్పడుతున్న కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కులు, గౌరవాన్ని కాపాడేందుకు జరుగుతున్న న్యాయపోరాటానికి మద్దతు ఇవ్వాలని మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్‌ను కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గ్యారల శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ప్రతి వర్గం పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు తమ శ్రమతో అభివృద్ధికి బాటలు వేస్తున్నారని కొనియాడారు. అలాంటి కార్మికులను అవమానించే విధంగా ఎవరూ మాట్లాడకూడదని అన్నారు. కార్మికుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే చర్యలను తాము సమర్థించబోమని, వారి న్యాయమైన డిమాండ్లకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యలు శాంతియుత మార్గంలో పరిష్కారం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పనుల పరిశీలించిన బీజేపీ నేతలు




**సికింద్రాబాద్, విశాలభారతి:** బౌద్ధ నగర్ డివిజన్ పార్సిగుట్ట లోని అర్బన్ డెవలప్మెంట్ ,అంబానగర్ హెల్త్ సెంటర్, అశోక్ నగర్ కమిటీ హాల్, అంబర్ నగర్ బాల్వాడి స్కూల్ ల నిర్వహణ పునరుద్ధరణ మరమ్మత్తు పనులను చేపట్టాలని జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ ఆదేశించడం జరిగింది.

# విడియా, ఎఫ్‌సీఐ కాలనీ నాలా పనులపై పునరాలోచించండి



నాలా పనులను పరిశీలిస్తున్న చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, బిజెపి నేతలు



కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి

- **అధికారులకు కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచన**
- **ప్రజలకు ఇబ్బంది కలిగించేలా కొత్త నాలా వద్దు**
- **పాత నాలా పునరుద్ధరించాలి రవికుమార్ యాదవ్**
- **అక్రమ కట్టడాలకు అండగా పనులు వద్దు**
- **కమీషన్ల కోసం కాకుండా ప్రజా ప్రయోజనంగా పని చేయాలి**

**శేరిలింగంపల్లి,విశాల భారతి :**

విడియా కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీల్లో చేపడుతున్న నాలా పనుల వల్ల రాబోయే రోజుల్లో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేయడంతో, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు.

**'పాత నాలా పునరుద్ధరించండి - కొత్త నాలా వద్దు'**

కాలనీ వాసులతో కలిసి నాలా పనులు జరుగుతున్న ప్రగతి ఎంక్లేవ్, టాకీటౌన్ రోడ్, విడియా కాలనీ, ఎఫ్‌సీఐ పార్క్ ప్రాంతాలను పరిశీలించిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఎన్‌డీపీ, ఇరిగేషన్ అధికారుల పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉన్న పాత నాలాను వెడల్పు చేసి పునరుద్ధరణ పనులు చేపట్టకుండా, కొత్తగా ప్రజలకు ఇబ్బంది కలిగించేలా నాలా తవ్వే అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. నాలపై ఉన్న అక్రమ కట్టడాల దారులకు అండగా ఉండేలా పనులు చేపట్టొద్దని స్పష్టం చేశారు. ఎస్ఎన్‌డీపీ, ఇరిగేషన్ అధికారులు మళ్లీ పునరాలోచించి, ప్రజలకు ఇబ్బంది లేని పరిష్కార మార్గాలను ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

**'కమీషన్ల కోసం కాదు - ప్రజల కోసం పని చేయాలి'**

బీజేపీ నేత రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు, అధికారులు కమీషన్ల కోసం, తమ అనుకూల వర్గాలకు లబ్ధి చేకూరేలా కాకుండా ప్రజలకు అనుగుణంగా పని చేయాలని హితవు పలికారు. 2023లోనే ఇంతకు ముందున్న నాలా పునరుద్ధరణకు శంకుస్థాపన చేసి, ఇప్పుడు మళ్లీ కొత్తగా నాలా పనులు చేపట్టడం వెనుక ఉద్దేశం ఏమిటని నిలదీశారు. ప్రజలకు వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా ఉపేక్షించేది లేదని, ఏ కాలనీ ప్రజలకైనా ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కాలనీ వాసులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**కాలనీ వాసుల ఆందోళన:**

విడియా కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీల్లో చేపడుతున్న నాలా పనుల వల్ల ఇళ్లు దెబ్బతినే ప్రమాదం, ప్రవేశ మార్గాలు మూసుకుపోయే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉన్న నాలాను అభివృద్ధి చేస్తే సరిపోతుందని, కొత్తగా ఇళ్ల ముందు నుంచి నాలా తవ్వడం వద్దని కోరారు. ఈ పర్యటనలో సమ్మెట ప్రసాద్, రాజేంద్రప్రసాద్, కేఎన్ఎల్ స్వామి, వెంకటేశ్వరావు, ఎన్వీ రావు, సూర్యనారాయణ ప్రభాకర్ రెడ్డి, మాధవరెడ్డి, రవీందర్ రెడ్డి, లక్ష్మణ్, నాగుల్ గౌడ్, గణేష్ ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్, విజయేందర్, శ్రీనివాస్, రాము, సురేష్ తదితర బీజేపీ నాయకులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కుమ్మరికట్టపై రోడ్డు, తూము నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్

**ఫైనల్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించిన గజ్జి భాస్కర్ యాదవ్, ఇరిగేషన్ అధికారులు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కుమ్మరికట్టపై రోడ్డు మరియు తూము నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రాజెక్టు డిజైన్ ప్రక్రియ పూర్తికావడంతో సంబంధిత అధికారులు ఫైనల్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మధు యాష్కి గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ యాదవ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ ఇరిగేషన్ శాఖ ఈఈ, డీఈ, ఏఈఈ అధికారులతో కలిసి ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు రోడ్డు, తూము నిర్మాణానికి సంబంధించిన తుది డిజైన్ వివరాలను పరిశీలించి, నిర్మాణ పనులకు సంబంధించిన సాంకేతిక అంశాలపై చర్చించారు. గత కొన్నేళ్లుగా కుమ్మరికట్ట ప్రాంతంలో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాకాలంలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుందని స్థానికులు పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ప్రజల సమస్యలను గుర్తించిన మధు యాష్కి గౌడ్ ప్రత్యేక చొరవతో ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత శాఖ అధికారులు ప్రతిపాదనలను పరిశీలించి తూము నిర్మాణంతో పాటు రోడ్డు అభివృద్ధికి అవసరమైన డిజైన్‌ను సిద్ధం చేశారు. ప్రస్తుతం డిజైన్ ప్రక్రియ పూర్తికావడంతో ఫైనల్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గజ్జి భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ.. ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. కుమ్మరికట్టపై రోడ్డు, తూము నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని, త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రాంతీయ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా.. పేదల అభ్యున్నతే లక్ష్యంగా సేవలు



**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ చేసిన కౌన్సిలర్ జెర్కోని మమత రాజు**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, పేదల అభ్యున్నతే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ జెర్కోని మమత రాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూతనందించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానికులు, విద్యార్థులు, తల్లిదండ్రులు విశేషంగా స్పందించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, స్టేషనరీ సామగ్రితో కూడిన స్కూల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జెర్కోని మమత రాజు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని అన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లు, చెడు సావాసాలకు దూరంగా ఉండి విద్యపై పూర్తి దృష్టి సారించాలని, మంచి మార్గంలో నడుస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూపుతున్న మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకొని మంచి విద్యను అభ్యసించి వారి పేరును నిలబెట్టాలని కోరారు. విద్యతోనే వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని పేర్కొన్న ఆమె, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ మంద సుధాకర్, కొంద్రు రవి, మహ్మద్ షబీర్, సోప్పరి కరుణాకర్, కొంద్రు మహేష్, కొంద్రు ప్రభు, కొంద్రు విజయ్, చెతల జంగయ్య, కొంద్రు శ్రీకాంత్, మంద సన్నీ, కొంద్రు వికాస్, మల్లెల శివ, ఎదుల రాజు, పెద్దగారి సాయి, కొంద్రు అఖిల్, శివ, చెతల కార్తీక్, నేనావత్ జలేందర్ (చిన్న), చెనమోని శివప్రసాద్, కిషోర్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎలక్షన్ కమిషన్ కార్యాలయం వద్ద వరద నీటి సమస్యకు పరిష్కారం

- **హిటాచీ ఎక్స్‌కవేటర్‌తో అడ్డంకులు తొలగించిన శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్**



**సైబరాబాద్ విశాలభారతి:** ఎలక్షన్ కమిషన్ కార్యాలయం వద్ద నిలిచిన వర్షపు నీటిని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ మంగళవారం తొలగించారు. ఉప కమిషనర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఖాజాగూడ చెరువులోకి వెళ్లే కాలువ మార్గంలో చెత్త, మట్టి, శిథిలాలు చేరడంతో నీరు ప్రవహించడం లేదని గుర్తించారు. దీనివల్ల రోడ్డుపై నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే హిటాచీ ఎక్స్‌కవేటర్ సహాయంతో అడ్డంకులను తొలగించి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించారు. ఈ చర్యలతో ఎలక్షన్ కమిషన్ కార్యాలయం చుట్టుపక్కల ప్రాంతాల్లో నీరు నిలవకుండా పౌరులకు ఇబ్బంది లేకుండా చూశారు. వర్షాకాలంలో జోన్ పరిధిలోని అన్ని నీటి ప్రవాహ మార్గాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని, వాటర్ లాగింగ్ సమస్య తలెత్తితే వెంటనే స్పందిస్తున్నామని జోనల్ కమిషనర్ తెలిపారు.

## ప్రభుత్వ విద్య బలోపేతానికి బడిబాట ర్యాలీ

**తల్లిదండ్రులకు అవగాహన**




**రాజేంద్రనగర్, విశాలభారతి :** శంషాబాద్ మండలం సాతంరాయి గ్రామంలో 'బడిబాట' కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, డ్రాప్‌అవుట్స్ లేకుండా ప్రతి పిల్లవాడిని పాఠశాలలో చేర్చడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, తల్లిదండ్రుల్లో విద్యపై అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి తప్పనిసరిగా బడిలో చేరేలా ప్రోత్సహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా విద్యాధికారి శ్రీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను బడికి పంపి వారి భవిష్యత్తును మెరుగుపరచాలని పిలుపునిచ్చారు. విద్య సమాజ అభివృద్ధికి పునాది అని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో చేరేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కిష్టారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, వెంకటయ్య, సువర్ణ, ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ 'బడిబాట' కార్యక్రమం గ్రామంలో విద్యపై చైతన్యం పెంచడంలో ముఖ్యపాత్ర పోషించింది.

## అల్లూరి ట్రేడ్ జంక్షన్ వద్ద నీటి నిలుపు సమస్యకు చెక్

- **సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద డీఆర్ఎఫ్ తనిఖీ - నీటిని తొలగించిన అధికారులు**
- **రద్దీ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులకు అడ్డుకట్ట**




**కూకట్ పల్లి విశాలభారతి:** ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలోని అల్లూరి ట్రేడ్ జంక్షన్ వద్ద నిలిచిన వర్షపు నీటిని మంగళవారం అధికారులు తొలగించారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సమీపంలోని ఈ ప్రాంతంలో వర్షం తర్వాత నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు, వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. డ్రైనేజీలో అడ్డంకులు, చెత్త చేరడంతో నీరు వెళ్లకుండా నిలిచినట్లు గుర్తించారు. దీనిపై డీఆర్ఎఫ్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందంతో సర్కిల్ డీసీ ఇ. చాముండేశ్వరి,కలిసి వర్క్ ఇన్‌స్పెక్టర్ మహాదేవ్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అడ్డంకులను వెంటనే తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నారు. డీఆర్ఎఫ్ వాహనం, సిబ్బంది సహాయంతో రద్దీగా ఉండే వాణిజ్య ప్రాంతంలో ట్రాఫిక్ ఆటంకాలు లేకుండా చూశారు. ఈ తనిఖీలతో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద వాహనదారులు, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యకు తాత్కాలిక పరిష్కారం లభించింది.

# సైబరాబాద్ ప్రెస్ అండ్ పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్–2026 ప్రారంభం





**సైబరాబాద్ విశాలభారతి:** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం. రమేష్ (ఐపీఎస్), మంగళవారం సీపీ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో సైబరాబాద్ ప్రెస్ అండ్ పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్ 2026ను ఘనంగా ప్రారంభించారు. పోలీసు మీడియా మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు, క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు జరుగుతున్న ఈ టోర్నమెంట్ జూన్ 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు నిర్వహించనుంది. సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, అదనపు డీసీపీ షమీర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది.మొదటి రోజు ఫలితాలు మల్కాజిగిరి మీడియా థండర్స్ కెప్టెన్ వంశీ,క్రైమ్ పార్ట్‌నర్స్‌ను ఓడించింది.జెస్తాది రాజు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ పొందగా,ఎస్‌సీఎస్‌సీ డిఫెండర్స్ కెప్టెన్ ప్రణవ్ శేరిలింగంపల్లి జట్టు కెప్టెన్ ఖదీర్ ను ఓడించింది.శివ కుమార్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..ఇటువంటి క్రీడా పోటీలు పోలీసు,మీడియా మధ్య పరస్పర అవగాహన, సమన్వయం, స్నేహాన్ని మరింత బలపరుస్తాయని తెలిపారు. "యునైటెడ్ ఇన్ స్పిరిట్ స్ట్రాంగర్ టుగెదర్"నినాదంతో ఈ టోర్నమెంట్ జరుగుతోంది. ఫైనల్ మ్యాచ్ జూన్ 11న సాయంత్రం జరగనున్నట్లు పేర్కొన్నారు.

## భారతమ్మకు నివాళులర్పించిన బసవరాజు శ్రీనివాస్

**కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నెమూరి శంకర్ గౌడ్ మాతృమూర్తి భారతమ్మ మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారతమ్మ మరణవార్త తెలుసుకున్న ఆయన, వారి స్వగృహానికి చేరుకుని భారతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెమూరి శంకర్ గౌడ్ తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తల్లిని కోల్పోవడం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ..భారతమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే ఆమె కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యం, ఆత్మస్థైర్యం ప్రసాదించాలని దేవుడిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. భారతమ్మకి నివాళులర్పించిన వారిలో పలువురు సామాజిక, రాజకీయ ప్రముఖులు, అభిమానులు, బంధుమిత్రులు పాల్గొని ఆమెకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

## ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ ఇంటిపై ఏసీబీ దాడులు





**సైబరాబాద్ విశాల భారతి :** అవినీతి అధికారులపై వరుస దాడులు నిర్వహిస్తున్న తెలంగాణ ఏసీబీ మంగళవారం ఉదయం నుంచి ఆర్అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ పై దాడులు చేపట్టింది.మోహన్ నాయక్ కు సంబంధించిన హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల్లోని నివాసాలు, బంధువుల ఇళ్లలో ఏసీబీ ఏకకాలంలో సోదాలు కొనసాగిస్తుంది. ఆదాయానికి మించి భారీగా వందల కోట్లలో అక్రమ ఆస్తులు కూడబెట్టాడన్న ఆరోపణల నేపథ్యంలో మోహన్ నాయక్ పై ఏసీబీ దాడులు చేపట్టింది. మాదాపూర్, మియాపూర్ లోని మోహన్ నాయక్ నివాసాలతో సహా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 11 నుంచి 15 ప్రాంతాలలో ఏసీబీ అధికారులు ఒకేసారి సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భారీగా స్థిర, చరాస్తులు, డాక్యుమెంట్లు మరియు విలువైన పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆస్తుల విలువ వందల కోట్ల రూపాయల్లో ఉంటుందని ప్రాథమిక అంచనా. సోదాలు పూర్తయిన తర్వాత ఏసీబీ దీనిపై పూర్తి స్థాయి అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది.

## హైదర్నగర్ వివేకానంద నగర్ మెయిన్ రోడ్డుపై పారిశుద్ధ్య తనిఖీ

- **డివైడర్ల పక్కన ఇసుక తొలగింపు, ఫిర్యాదుల పరిష్కారం**
- **ఆల్విన్ కాలనీ సర్కిల్ 51డీసీ ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటన**



**కూకట్ పల్లి విశాల భారతి:** ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలోని హైదర్నగర్ నుంచి వివేకానంద నగర్ వరకు ఉన్న మెయిన్ రోడ్డుపై డీసీ ఇ.చాముండేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య తనిఖీ చేపట్టారు.రోడ్డుపై డివైడర్ల పక్కన పేరుకుపోయిన ఇసుక, దుమ్మును వెంటనే తొలగించాలని సిబ్బందికి సూచించారు. ట్రాక్టర్ సహాయంతో ఇసుకను తొలగించే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన గ్రీవెన్స్ లను కూడా అక్కడికక్కడే పరిష్కరించారు.రోడ్లు, డివైడర్లు శుభ్రంగా ఉంచడం ద్వారా వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. రోజువారీ పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సానిటేషన్ సిబ్బంది, సూపర్ వైజర్లు, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగునికి కృత్రిమ కాలు అందజేత



**కూకట్ పల్లి విశాలభారతి:** కుత్బుల్లాపూర్‌కు చెందిన దస్తగిరి ప్రమాదంలో తన కుడి కాలును కోల్పోయి చాలా కాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారు.రోజువారీ పనులు చేసుకోవడంలో కూడా కష్టాలు పడుతున్న ఆయన పరిస్థితిని తెలుసుకున్న తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ వెంటనే స్పందించారు. దస్తగిరికి అవసరమైన సహాయం అందించేందుకు భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునర్వసతి కేంద్రం ట్రస్ట్‌ను సంప్రదించి, కృత్రిమ కుడి కాలు (ఆర్టిఫిషియల్ రైట్ లెగ్) అందేలా చర్యలు చేపట్టారు. శివకృష్ణ చొరవతో దస్తగిరికి కృత్రిమ కాలు అందడంతో ఆయన జీవితంలో కొత్త ఆశలు చిగురించాయి. ఇకపై రోజువారీ పనులను మరింత సులభంగా నిర్వహించుకునే అవకాశం లభించింది. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి న్యూ శక్తి దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి టి. చిరంజీవి, జవహర్‌నగర్ బలగంటి సీఈవో చింతల విజయ్ కుమార్, జినుక రఘు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూకట్పల్లి భారత్ వికాస్ ట్రస్ట్ మేనేజర్ నరేంద్ర , సంధ్య, టెక్నీషియన్ రఘు, మధు, స్వామి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెరుగు శివకృష్ణ మాట్లాడుతూ, సమాజంలో ఇంకా అనేక మంది దివ్యాంగులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాలకు చెందిన దివ్యాంగులకు విద్య, ఉపాధి, వైద్యం, వివాహం వంటి అంశాల్లో ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన భారత్ వికాస్ ట్రస్ట్‌కు వికలాంగుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవసరంలో ఉన్న ప్రతి దివ్యాంగుడికి అండగా నిలవడం మనందరి సామాజిక బాధ్యత అని మెరుగు శివకృష్ణ పేర్కొన్నారు.

# గచ్చిబౌలి ట్రాఫిక్‌కు ఊరట ఐఐఐటీడీఎల్ఎఫ్ ఫ్లైఓవర్ పనులు వేగం

- **పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ రమేష్, 3 నెలలు ట్రాఫిక్ డైవర్షన్లు**
- **వాహనదారుల ఇబ్బందులు తగ్గించే చర్యలు, భవిష్యత్‌లో రద్దీకి చెక్**

**సైబరాబాద్ - విశాలభారతి:**

ఐటీ కారిడార్‌లో రోజూ వేలాది మంది ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. గచ్చిబౌలిలోని ఐఐటీ జంక్షన్ నుంచి డీఎల్ఎఫ్ జంక్షన్ వరకు చేపట్టిన ఫ్లైఓవర్, రహదారి విస్తరణ పనులను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ సోమవారం స్వయంగా పరిశీలించారు.గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ నుంచి డీఎల్ఎఫ్ వరకు సాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని సీపీ క్షేత్రస్థాయిలో సమీక్షించారు. శేరిలింగంపల్లి ఏడీసీపీ హనుమంతరావు, సీఎంసీ అధికారులతో



**పనుల పరిశీలన,అధికారులకు పలు సూచనలు సలహాలు చేస్తున్న సీపీ రమేష్**

కలిసి ప్రాజెక్ట్ స్థలాన్ని పరిశీలించిన ఆయన, పనులు నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

**3 నెలలు ట్రాఫిక్ డైవర్షన్లు:**

నిర్మాణ పనుల వల్ల వాహనదారులు పడుతున్న ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే మూడు నెలల పాటు ప్రత్యేక ట్రాఫిక్ అడ్వైజరీ అమలు చేయాలని, కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సిగ్నల్ వ్యవస్థను ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సర్దుబాటు చేయాలని, ప్రత్యామ్నాయ మార్గాలపై సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

**పనులు పూర్తయితే ట్రాఫిక్‌కు చెక్ :**

ఈ సందర్భంగా సీపీ రమేష్ మాట్లాడుతూ, ఫ్లైఓవర్, రోడ్డు విస్తరణ పనులు పూర్తయిన తర్వాత గచ్చిబౌలిడీఎల్ఎఫ్ మార్గంలో ట్రాఫిక్ రద్దీ భారీగా తగ్గుతుందని చెప్పారు. ఐటీ ఉద్యోగులు, ప్రయాణికులకు సాఫీగా, వేగంగా ప్రయాణం సాధ్యమవుతుందన్నారు. వాహనదారులు ప్రస్తుతానికి ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని కోరారు.ఈ పరిశీలన కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ సురేష్, సీఎంసీ, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో మరోసారి రెచ్చిపోయిన నేపాలీ గ్యాంగ్

- **గచ్చిబౌలి హిల్ రిడ్జ్ విల్లాలో భారీ దోపిడీ కేజీ బంగారాం, వజ్రాలతో పరార్**
- **ఉత్తర్‌ప్రదేశ్ పోలీసుల సహకారంతో యూపీ-నేపాల్ సరిహద్దు వద్ద ఇద్దరు నిందితుల అరెస్ట్**
- **వారి వద్దనుంచి ఆరు కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం**




**సైబరాబాద్ - విశాలభారతి:**

భాగ్యనగరంలో నేపాలీ ముఠాలు మరోసారి దొంగతనాలకు పాల్పడింది.తాజాగా గచ్చిబౌలి ప్రాంతంలోని హిల్ రిడ్జ్ విల్లాలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త ప్రకాశ్ ఇంట్లో సుమారు ఒక కేజీ బంగారు ఆభరణాలు, వజ్రాలతో కూడిన విలువైన నగలను అపారించిన ఘటన సంచలనం సృష్టించింది. పోలీసు వివరాల ప్రకారం,బాధితుడు నెల రోజుల క్రితం నేపాల్‌కు చెందిన కమలా షాహీ, విమల్ షాహీ,దంపతులను ఇంటి పనులకు నియమించుకున్నారు. వారి బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ లేదా గుర్తింపు పత్రాలను సరిగ్గా పరిశీలించకుండానే వారిని ఇంట్లోకి అనుమతించారు. వ్యాపారవేత్త కుటుంబం వ్యక్తిగత పనులపై ముంబై వెళ్లిన సమయంలో ఈ దంపతులు తమ ప్రణాళికను అమలు చేశారు.ఆదివారం ముంబై నుంచి తిరిగి ఇంటికి వచ్చిన యజమాని కుటుంబం పనివారు కనిపించకపోవడంతో ఆశ్చర్యపోయరు. తలుపులు ,తాళాల్లో ఎలాంటి బలవంతపు ప్రవేశం ఆనవాళ్లు కనిపించలేదు,అయితే పూజగదిలో దేవత విగ్రహానికి ఉన్న బంగారు గొలుసు కనిపించకపోవడంతో అనుమానం వచ్చి ఇంటి లోపలి భాగాలను తనిఖీ చేశారు. బెడ్‌రూమ్‌లోని లాకర్లు డూప్లికేట్ చాబిలతో తెరిచి లోపల ఉన్న బంగారం, వజ్రాభరణాలు అపహరించినట్లు గుర్తించారు.బాధితుడు వెంటనే గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో పాటు సీసీటీవీ ఫుటేజీలను సేకరించి పరిశీలిస్తున్నారు. నిందితులు నేపాల్ దేశానికి పారిపోయే అవకాశం ఉండటంతో బార్డర్ ఏజెన్సీలతో కలిసి కూడా గాలింపు చర్యలు చేపట్టారు.చివరకు ఉత్తర్‌ప్రదేశ్ పోలీసుల సహకారంతో యూపీనేపాల్ సరిహద్దు వద్ద ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి ఆరు కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.హైదరాబాద్‌లో నేపాలీ ముఠాల ముప్పు ఇది మొదటిసారి కాదు,ఇటీవల జూబ్లీ హిల్స్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్యను క్రూరంగా హత్య చేసి దోపిడీ చేసిన ఘటనలో కూడా నేపాలీ గ్యాంగ్ ప్రమేయం ఉంది. ఇంటి పనివారిగా చేరి నమ్మకం సంపాదించి, సమయం చూసి దోపిడీలు చేసి నేపాల్‌కు పారిపోవడం ఈ ముఠాల సాధారణ పద్ధతిగా మారింది.ఈ నేపథ్యంలో ఇళ్లల్లో నేపాలీ లేదా ఇతర రాష్ట్రాల పనివారిని పనిలో పెట్టుకునే ముందు వారి పూర్తి వివరాలు,గుర్తింపు కార్డులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయించాలని పోలీసు అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఫీజుల భారం మోస్తున్న తల్లిదండ్రులు.. చర్యలు ఎప్పుడు?

**ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీపై ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి : బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బొంగు వెంకటేష్ గౌడ్**




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చాయని, దీనివల్ల సామాన్య, మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బొంగు వెంకటేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగంలో పెరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ... ఎల్కేజీ నుంచి పీజీ, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల వరకు వేల నుండి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలపై ప్రభుత్వం కఠిన నిఘా పెట్టాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకు మించి వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, నిబంధనలను ఉల్లంఘిస్తున్న సంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం తల్లిదండ్రులు పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఫీజుల భారం కారణంగా అనేక కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా నిరుపేద కుటుంబాలు, రోజువారీ కూలీలు, మధ్యతరగతి వర్గాలు తమ పిల్లల విద్యను కొనసాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఫీజు నియంత్రణ జీవోలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ప్రైవేట్ పాఠశాల, కళాశాలలో ఫీజుల వివరాలను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పుస్తకాలు, యూనిఫాంలు, ప్రత్యేక ఫీజులు, ఇతర పేర్లతో అదనపు వసూళ్లు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న విద్యా రంగంలో దోపిడీకి తావులేకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులను మానసికంగా వేధించడం, తరగతులకు అనుమతించకపోవడం లేదా పరీక్షలకు దూరం చేయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటే బీసీ పీపుల్స్ ఫెడరేషన్ విద్యార్థులు, తల్లిదండ్రుల తరపున పోరాటం నిర్వహిస్తుందని హెచ్చరించారు. సామాన్య ప్రజలకు న్యాయం జరిగే వరకు, ఫీజు నియంత్రణపై ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని అమలు చేసే వరకు బీసీ పీపుల్స్ ఫెడరేషన్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని బొంగు వెంకటేష్ గౌడ్ స్పష్టం చేశారు.

## సీఎంసీ పరిధి మున్సిపల్ కార్మికుల ధర్నా

- **జీహెచ్ఎంసీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్**
- **డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత**

**సైబరాబాద్- విశాల భారతి**

సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ పరిధిలో విలీనమైన మున్సిపాలిటీల కార్మికులు గురువారం ధర్నా చేపట్టి తమ సమస్యల పరిష్కారం కోరారు. మియాపూర్, శేరిలింగంపల్లి, అమీన్‌పూర్, రామచంద్రపురం, బాచుపల్లి, నిజాంపేట్, దుండిగల్, గుడ్ల పోచంపల్లి, గండి మైసమ్మ, మేడ్చల్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి కార్మికులు భారీగా తరలివచ్చారు. సీఎంసీలో విలీనం తర్వాత తమకు జీహెచ్ఎంసీ స్థాయిలో వేతనాలు, ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రధాన డిమాండ్లు:**

1. జీహెచ్ఎంసీలో అమలవుతున్న వేతనాలనే సీఎంసీ పరిధిలోనూ వర్తింపజేయాలి.
2. ఈఎస్ఐ, పీఎఫ్ లను పటిష్టంగా అమలు చేసి ప్రతి కార్మికుడికి లబ్ధి చేకూర్చాలి.
3. విధి నిర్వహణలో మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.
4. మరణించిన కార్మికురాలి కుటుంబానికి మట్టి ఖర్చులు రూ.50 వేలు మంజూరు చేయాలి.

ధర్నా ముగిసిన అనంతరం కార్మికులు సీఎంసీ డిప్యూటీ కమిషనర్ ను బాలకృష్ణ కలిసి వినతిపత్రం అందజేశారు.డిమాండ్లు నెరవేర్చకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**సీఐటీయూ సంఘీభావం:** ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొంగరి కృష్ణ, నాగేశ్వరావు, అశోక్, రాజశేఖర్, లింగస్వామి, సంతోష్ పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

## క్రీడా ప్రాంగణాన్ని చెత్తకుప్పగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

- **మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఫైర్.. రేవంత్ సర్కార్‌పై మండిపాటు**
- **ఈనెలాఖరులోపు డంపింగ్ యార్డ్ తొలగిస్తాం.. మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ హామీ**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో పిల్లల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం చెత్త ప్రాంగణంగా మారడంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వల్ల యువతకు ఉపయోగపడాల్సిన క్రీడా స్థలం చెత్తకుప్పగా మారిందని మండిపడ్డారు.మంగళవారం ఆమె స్వయంగా డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ ఈనెలాఖరులోపు డంపింగ్ యార్డ్‌ను పూర్తిగా తొలగిస్తాం అని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పిల్లలు, యువత కోసం క్రీడా ప్రాంగణం, నర్సరీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆ ప్రదేశం చెత్త ప్రాంగణంగా మారిందని ఆరోపించారు. యువత భవిష్యత్తును నాశనం చేసే విధానాలను ప్రభుత్వం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.తెలంగాణ యువతకు క్రీడల్లో గౌరవం తీసుకురావాల్సిన ప్రాంగణాన్ని చెత్తతో నింపడం బాధాకరం. క్రీడా ప్రాంగణాన్ని వెంటనే పునరుద్ధరించి పిల్లలకు అందుబాటులోకి తేవాలి అని ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్లి దీవెన పథకం చెక్కును అందజేసిన సర్పంచ్



**మొయినాబాద్, విశాలభారతి:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో భాగంగా రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ షాపురం రాజు మరోసారి తన మాట నిలబెట్టుకున్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో అమలు చేస్తున్న అమ్మ పుణ్యవతి తల్లి దీవెన పథకం కింద నూతనంగా జన్మించిన శిశువు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన కుండే శేఖర్-శ్వేత దంపతులకు మగబిడ్డ జన్మించగా, సర్పంచ్ షాపురం రాజు వారి నివాసానికి వెళ్లి రూ.11,000 విలువైన ఏడవ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ షాపురం రాజు మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో జన్మించే ప్రతి శిశువు కుటుంబానికి అమ్మ పుణ్యవతి తల్లి దీవెన పథకం ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు వ్యక్తిగతంగా కూడా గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న సర్పంచ్ షాపురం రాజును గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ అద్దె బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




**రాజేంద్రనగర్, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్రంలో మహిళా సాధికారతకు మరో ముఖ్యమైన అడుగు పడింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఒక వినూత్న పథకాన్ని ప్రారంభించింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన నడిపే అవకాశాన్ని కల్పిస్తూ, బ్యాంకుల ద్వారా ప్రత్యేక రుణ సదుపాయం అందిస్తోంది. ఈ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు కేటాయించిన 400 సరికొత్త బస్సులను ఒకేసారి ప్రారంభించారు. ఈ కార్యక్రమం మహిళలను గృహిణులుగా మాత్రమే కాకుండా వ్యాపారవేత్తలుగా, రవాణా రంగంలో భాగస్వాములుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది. రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా శంషాబాద్‌లో జరిగిన ప్రారంభోత్సవంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఆయన స్థానిక మహిళా సంఘానికి చెందిన ఆర్టీసీ అద్దె బస్సును రిబ్బన్ కట్ చేసి, పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళా సంఘాలకు రుణ సదుపాయం కల్పించి బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు వారికి స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడానికి ఈ పథకం దోహదపడుతుందని అన్నారు. మహిళా సంఘాల ద్వారా బస్సులు నడపడం వల్ల ఆర్టీసీలో బస్సుల కొరత కొంతవరకు తగ్గడంతో పాటు, మహిళలకు నిరంతర ఆదాయం లభిస్తుందని ఆయన వివరించారు. ఈ పథకం మహిళా సాధికారతకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. బస్సులను పొందిన మహిళా సంఘాల సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## అగ్ని వీర్‌లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

**మిట్టగూడెం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవి బండారుపల్లి**



**విశాలభారతి, మణుగూరు :** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాల మణుగూరు నుంచి ఇటీవల వెలువడిన అగ్నివీర్ ఫలితాలలో,బి.జనార్ధన్ ఏం. పి. సి. ఎస్ సాంబశివరావు. ఈ పి. పి గ్రూప్ నుంచి ఇద్దరు గిరిజన విద్యార్థులు భారత దేశ రక్షణ రంగంలో సేవలు అందించడానికి ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశాన్ని రక్షించడం అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటమే కాదు, పౌరుడిగా బాధ్యతాయుతంగా వ్యవహరించడం కూడా ఒక బాధ్యత అని అన్నారు. బాధ్యతాయుతమైన పౌరుడిగా చట్టాలను గౌరవించడం, చెట్లను నాటడం, నీరు మరియు విద్యుత్ ను ఆదా చేయడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ద్వారా దేశ పర్యావరణాన్ని రక్షించాలి అని ఆయన తెలిపారు. ఐక్యత మరియు శాంతి, మత, కుల భేదాలు లేకుండా అందరితో సఖ్యతగా ఉంటూ దేశ సమగ్రతకు భంగం కలగకుండా చూడలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ రవి బండారుపల్లి మరియు స్టాఫ్ విద్యార్థులు, పలువురు ప్రత్యేక అభినందనలు తెలియజేసారు.

# పార్టీలు మారిన గాంధీకి రాజీనామా చేసే దమ్ముందా?

- నవతా రెడ్డి సూటి ప్రశ్న
- సీఎం సభ విఫలమైతే బీఆర్ఎస్‌పై నెపం వేయడం ఎమ్మెల్యే అసమర్థతకు నిదర్శనం
- క్రెడిట్ దొంగతనం, అంకెల మోసం, పాత హామీల గల్లంతు



విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతున్న బొబ్బ నవత రెడ్డి బిఆర్ఎస్ నేతలు

**శేరిలింగంపల్లి - విశాలభారతి:**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన అభివృద్ధి పనుల శంకుస్థాపన సభ పూర్తిగా విఫలం కావడంతో, ఆ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై బురద చల్లుతున్నారని బీఆర్ఎస్ నేత బొబ్బ నవతా రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సభకు జనం రాకపోవడం తన అసమర్థత అని ఒప్పుకోకుండా ఎదుటివారిపై ఏడవడం సిగ్గుచేటని ఆమె విమర్శించారు. దమ్ము, ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ ప్రజల ముందుకు వచ్చి గెలిచి తన సత్తా నిరూపించుకోవాలని సూటిగా సవాల్ విసిరారు.

**'సభకు జనం రాలేదు - మాపై ఏడుపు ఎందుకు?'**

ముఖ్యమంత్రి సభకు ప్రజలు భారీగా రావాలని ముందుగానే ప్రకటించిన ఎమ్మెల్యే గాంధీ, సభ రోజున మాత్రం మైదానం ఖాళీగా ఉండడంతో నోట మాట రాలేదు. వచ్చిన వారికి మంచినీళ్లు, కుర్చీలు, నీడ కూడా కల్పించలేకపోయారు. అయినా బాధ్యత తీసుకోకుండా, సీఎం ముందు నిలబడి 'ప్రతిపక్షాలు ఇంటింటికీ వెళ్లి గడియారాలు పంచి, శాలువాలు కప్పి మీటింగ్‌కు రావద్దని చెప్పడం వల్లే జనం రాలేదు' అని క్షమాపణలు చెప్పడం ఆయన దిగజారుడుతనానికి పరాకాష్ట అని నవతా రెడ్డి ఎద్దేవా చేశారు. గత రెండు నెలలుగా బీఆర్ఎస్ అధినాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కృష్ణారావు ఫోటోలతో కూడిన గడియారాలను పంచుతూ గడపగడపకు తిరుగుతున్నామని, ప్రజల కష్టసుఖాల్లో తాము ఉంటున్నామని చెప్పడం మా ప్రజాస్వామిక హక్కు అని స్పష్టం చేశారు. అది చూసి భరించలేక, కడుపుమంటతోనే ఎమ్మెల్యే గాంధీ సీఎం ముందు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

**'రంగు మార్చే రాజకీయ ఊసరవెల్లి - అధికారం చూసి వంగే నీతి'**

అసలు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఏ పార్టీకి చెందినవారో, ఆయన అధినాయకుడు ఎవరో ప్రజలకు చెప్పే ధైర్యం ఉందా అని నవతా రెడ్డి నిలదీశారు. 2014లో టీడీపీ సైకిల్ గుర్తుపై గెలిచి, ఆ తర్వాత కారు ఎక్కారు. 2018, 2023లో బీఆర్ఎస్ కారు గుర్తుపై గెలిచి మంత్రి పదవులు అనుభవించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ రంగు మార్చి కాంగ్రెస్ నాయకుల చేతిలో చెయ్యి వేశారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వంగి సలాం కొట్టడం, ఆ ముఖ్యమంత్రిని పొగడటం ఆయనకు పుట్టుకతో వచ్చిన అలవాటుగా మారిందని విమర్శించారు. 2018 ఎన్నికల్లో రూ. 5 వేల కోట్లు, 2023 ఎన్నికల్లో రూ. 9 వేల కోట్లతో శేరిలింగంపల్లిని అమెరికా తరహాలో అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పిన గాంధీ, ఇప్పుడు రేవంత్ రెడ్డికి దొంగ నమస్కారాలు పెడుతున్నారని ఎత్తిపొడిచారు. బీఆర్ఎస్ పార్టీ పేరు ఎత్తే హక్కు, అర్హత గాంధీకి లేవని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు.

**'అంకెల గారడీ - క్రెడిట్ కొట్టే కుట్ర'**

కేసీఆర్, కేటీఆర్ హయాంలో హైదరాబాద్ నగరంలో 30 నుంచి 40 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించినా కాంగ్రెస్ నాయకులు నోరు మెదపలేదు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కేవలం రెండు ఫ్లైఓవర్లు ప్రారంభించి 200 పత్రికా ప్రకటనలు ఇస్తూ పెద్ద హంగామా చేస్తోందని నవతా రెడ్డి విమర్శించారు. చేసేది రూ. 800 కోట్ల పనులు అయితే, వాటిని రూ. 2 వేల కోట్లుగా తప్పుడు లెక్కలు చూపుతున్నారని మండిపడ్డారు. సీఎం శంకుస్థాపన చేసిన రూ. 1600 కోట్ల పనుల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందినవి కేవలం రూ. 600 కోట్లేనని, మిగతా శంకర్‌పల్లి, ఓఆర్ఆర్, కొల్లూరు, బాచుపల్లి తదితర ప్రాంతాల పనులను కూడా లాగేసి శేరిలింగంపల్లి క్రెడిట్‌గా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. చందానగర్‌లో జర్నలిస్టులు, మార్వాడీలు, మైనార్టీలు, వివిధ కుల సంఘాలకు భవనాల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కానీ ఆ క్రెడిట్ మొత్తం రేవంత్ రెడ్డికి ఇస్తూ గాంధీ అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే ఆ స్థలాల్లో భవనాలు నిర్మించి అప్పుడు గొప్పలు చెప్పుకోవాలని సవాల్ చేశారు.

**'పాత శిలాఫలకాలే నీ పనితీరుకు సాక్ష్యం'**

గత పదేళ్లుగా ఎమ్మెల్యే గాంధీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నవతా రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. 700 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, 50 ఎకరాల్లో బస్ టెర్మినల్, మియాపూర్ బీహెచ్ఈఎల్ సింగిల్ పిల్లర్ మెట్రో ప్రాజెక్టు, చెరువుల సుందరీకరణ, 16 ఎస్టీపీ ప్లాంట్లు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి హామీలు అన్నీ గాలికొదిలేశారని ఆరోపించారు. ఆ హామీలు గాలికొదిలేసి, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల కోసమే మళ్లీ కొత్త శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఎన్నికల సమయంలో గాంధీ వేసిన శిలాఫలకాలే ఇప్పుడు ఆయన్ను చూసి వెక్కిరిస్తున్నాయని, మళ్లీ కొత్త శిలాఫలకాలతో ప్రజలను మభ్యపెట్టడానికి సిగ్గు లేదా అని నిప్పులు చెరిగారు.

## రి మండల స్వర్ణ కారుల సంఘం ఏకగ్రీవ ఎన్నిక



**తిరుమలగిరి, విశాలభారతి :** రాష్ట్ర స్వర్ణకార సంఘం సహాయ కార్యదర్శి నారాయణదాసు రామాచారి, రాష్ట్ర స్వర్ణకార సంఘం ఆర్గనైజర్ సెక్రెటరీ బాణాల శ్రీనివాస్, సూర్యాపేట జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు తోగిట్టి మురళి, ఆధ్వర్యంలో తిరుమలగిరి మండలం స్వర్ణకారుల సంఘం ఎన్నికను నిర్వహించడం జరిగింది. అధ్యక్షులుగా తల్లోజు శ్రీనివాస చారి, సెక్రటరీగా మాచర్ల నాగాచారి, కోశాధికారిగా కత్రోజు లక్ష్మణాచారిలను ఏకగ్రీవంగా ఎన్నికోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో మాజీ మండలం అధ్యక్షులు మా రోజు ఈశ్వర చారి, మల్లికార్జున చారి, పోలోజు విజయకుమార్, తొగటి యాదగిరి చారి, కందుకూరి శ్రీనివాస్ చారి, రాధాకృష్ణ, అరుణ్, దిలీప్, సాయి కిరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కృషి



**దేవరుప్పుల విశాలభారతి:** వానకొండయ్య లక్ష్మీనరసింహస్వామి గుట్ట మైనింగ్ అనుమతులను రద్దు చేసిన జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాని కలిసి వానకొండయ్య లక్ష్మీనరసింహ స్వామి గుట్ట వద్ద జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ ఫిర్యాదుపై జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ చేపట్టగా పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**విచారణలో కీలక అంశం:** విచారణ సందర్భంగా లీజుదారు స్వయంగా ధర్మాపురం గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని అంగీకరించారు.ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ అత్యంత కీలక ఆధారంగా పరిగణించారు.

**గుర్తించిన ఇతర లోపాలు:** 20112018న జారీ చేసిన రెవిన్యూ ఎన్ఓసీకి సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలో నోట్ ఫైల్,సంబంధిత రికార్డులు లభించలేదు.గ్రామ పంచాయతీ అనుమతి లేకపోవడం.రెవిన్యూ NOCకు సంబంధించిన సరైన ఆధారాలు లేకపోవడం.ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని సంబంధిత క్వారీ లీజును రద్దు చేసే దిశగా జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు.ప్రజల మనోభావాలకు అనుగుణంగా, వానకొండయ్య లక్ష్మీనరసింహస్వామి గుట్ట పరిరక్షణ కోసం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన కృషి ఫలించింది.

## సహజ వనరులపై మీ దోపిడీ ఆపాలి

**పల్లా సుందర్ రాంరెడ్డి**



**దేవరుప్పుల విశాలభారతి:** మండలం,కడవెండి గ్రామ పరిధిలో ఉన్న వానకొండయ్య లక్ష్మి నరసింహా స్వామి గుట్టకు జరుగుతున్న అక్రమ మైనింగ్ పై బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి.అంతకు ముందు వానకొండయ్య శ్రీ లక్ష్మీ నరసింహా స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకుల శ్రమ విజయవంతమయిందని, 2018 సంవత్సరంలో రోహిత్ పాల్ మినరల్స్ కు ఆన్ లైన్ లో పర్మిషన్ వచ్చిందని, 2021సంవత్సరంలో మైనింగ్ చేయడానికి ఇక్కడికి వచ్చారని,మైనింగ్ పనులు అడ్డుకున్నదందుకు నాయకులపై,కడవెండి గ్రామ వాసులపై నోటీసులు పంపించారని,అయినా మా నాయకులు,మా సర్పంచ్ లు అలుపెరుగని పోరాటం చేసి మైనింగ్ పనులు జరగకుండా చేశారని,అప్పటి నుండి ఇప్పటి వరకు మైనింగ్ పై పోరాటం చేస్తూనే ఉన్నామని,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మైనింగ్ నిర్వాహకుడు మైనింగ్ నిర్వహిస్తున్నాడని, ఇక్కడున్న ఎమ్మెల్యే యశస్విని,ఝాన్సీ రెడ్డి మైనింగ్ పనులను ఆపుతుందేమోనని పది రోజులు ఓపిక పట్టామని,కానీ కమిషన్ల కొరకు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలుసుకొని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గారితో నాయకులమంతా కలిసి మైనింగ్ పనులు ఆపాలని జిల్లా కలెక్టర్ గారికి మెమోరాండం ఇచ్చామని,కలెక్టర్ సమగ్ర విచారణ చేసి గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోనందుకు,రెవిన్యూ ఎన్ఓసి కి సరైన రికార్డులు లేక పోవడంతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రోహిత్ పాల్ మినరల్స్ క్వారీ లీజును రద్దు చేశారని,కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడు కూడా మైనింగ్ ను ఆపే ప్రయత్నం చేయకపోవడమేకాక గత ప్రభుత్వమిచ్చిందని మామీదనే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని,ఎక్కడో ఉన్న కాంట్రాక్టర్ ఇచ్చే కమిషన్ల కు కక్కుర్తి పడి మా నాయకులను, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని,ఈ ప్రాంతానికి మీరు మంచి చేయకున్నా పర్వాలేదు కానీ ఇక్కడున్న సహజ వనరులపై మీ దోపిడి ఆగాలని,ప్రజల సమస్యలపై పోరాటం చేసిన బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని,కోటి రూపాయలు నిధులు తెచ్చామని చెబుతున్నారు కదా ఇక్కడ మేము చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుంది తప్పా మీరు చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు చెప్పాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధారావత్ రాంసింగ్ నాయక్,మండల బిఆర్ఎస్ నాయకులు,యువజన నాయకులు,ఆయా గ్రామాల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,సర్పంచ్ లు,మహిళా నాయకురాళ్లు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగ్గురిని కాపాడి అమరుడైన అనురూప్ రెడ్డి



**ఆయన త్యాగం చిరస్మరణీయం – కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది : ఎంపీ చామల, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి, మందుల సామెల్**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

అమెరికాలో ముగ్గురు స్నేహితుల ప్రాణాలను కాపాడి తన ప్రాణాలను త్యాగం చేసిన అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామానికి చెందిన యువకుడు అనురూప్ రెడ్డికి ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ కవాడిపల్లికి చేరుకుని అనురూప్ మృతదేహానికి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా యువకుడి అసాధారణ ధైర్యసాహసాలను కొనియాడుతూ, ఆయన త్యాగం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కవాడిపల్లి గ్రామానికి చెందిన కోడూరు రాజేందర్ రెడ్డి, దుర్గాభవాని దంపతుల చిన్న కుమారుడు అనురూప్ రెడ్డి ఉన్నత విద్యాభ్యాసం కోసం రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. అక్కడ యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌లో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేసి, ఉద్యోగంలో చేరేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. గత నెల 30వ తేదీన అనురూప్ తన స్నేహితులతో కలిసి అమెరికాలోని లూసియానా రాష్ట్రంలోని టోరోడో పార్కు సమీపంలో ఉన్న సెబాన్ నది వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ముగ్గురు స్నేహితులు నదిలో లోతైన ప్రాంతంలో చిక్కుకుని మునిగిపోయే ప్రమాదంలో పడ్డారు. పరిస్థితిని గమనించిన అనురూప్ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శిస్తూ వారిని ఒక్కొక్కరిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చాడు. అయితే తాను ఒడ్డుకు వస్తున్న సమయంలో నదిలో వేసి ఉన్న వల అతడి కాళ్లకు చిక్కుకోవడంతో నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన అమెరికాలోని తెలుగు రాష్ట్రాల ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. పదిరోజుల పాటు కొనసాగిన గాలింపు చర్యల అనంతరం అనురూప్ మృతదేహాన్ని గుర్తించి, స్వగ్రామమైన కవాడిపల్లికి తరలించారు. మృతదేహం గ్రామానికి చేరుకున్న వెంటనే గ్రామమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి కన్నీరుమున్నీరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, మందుల సామెల్ మాట్లాడుతూ.. అనురూప్ చూపిన సమయస్ఫూర్తి, మానవత్వం, ధైర్యసాహసాలు అరుదైనవని కొనియాడారు. తన ప్రాణాలను పణంగా పెట్టి ముగ్గురిని కాపాడటం గొప్ప త్యాగమని పేర్కొన్నారు. యువకుడి సేవలను గుర్తిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపించిన ప్రశంసా పత్రం (కమెండేషన్ లెటర్)ను కుటుంబ సభ్యులకు అందజేశారు. అనురూప్ వంటి యువత సమాజానికి ఆదర్శమని, ఆయన త్యాగాన్ని ప్రభుత్వం గౌరవిస్తుందని, కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. అనురూప్ మరణం కేవలం కుటుంబానికే కాకుండా మొత్తం తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ గ్రామ సర్పంచ్ కొలను లక్ష్మీ ప్రసన్న రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ రాసాల రాము, రైతు సహకార సంఘం డైరెక్టర్ ముత్యాల రాజశేఖర్ తోపాటు గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున విచ్చేసి అనురూప్ రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు.





## ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై విచారణ జరపాలి

**ఏబీవీపీ నాయకులు .. ఎంఈఓకు వినతిపత్రం అందజేత**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మండలంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు మండల విద్యాధికారి (ఎంఈఓ)కి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా శంషాబాద్ జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, మండలంలోని అనేక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అలాగే పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర విద్యా సామగ్రిని నిర్దిష్ట దుకాణాల నుంచే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని తెలిపారు. విద్యార్థులపై అధిక విద్యాభారం మోపడంతో పాటు ప్రత్యేక తరగతుల పేరుతో మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని విద్యాసంస్థలు సరైన అనుమతులు, మౌలిక వసతులు లేకుండానే నిర్వహించబడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో మొయినాబాద్ మండలంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై జరిమానాలు, శిక్షలు విధించాలని కోరారు. అలాగే విద్యార్థులు, తల్లిదండ్రుల ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ లేదా ఫిర్యాదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. విద్యార్థుల భవిష్యత్తు, విద్యా వ్యవస్థ పరిరక్షణ దృష్ట్యా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని ఏబీవీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిటీ ఎగ్జిక్యూటివ్ వడ్ల సంజయ్, రాష్ట్ర నాయకులు చందు, నగర కార్యదర్శి వినయ్, చరణ్, పవన్ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## కీసర ఆర్డీఓగా బాధ్యతల చేపట్టిన నల్ల వెంకట్ రెడ్డి



**కీసర,విశాల భారతి :** కీసర రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఎన్. వెంకట రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.గత నెల 31న కీసర ఆర్డీవోగా విధులు నిర్వహించిన ఎస్. రాజేష్ కుమార్ పదవీ విరమణ చేయడంతో ఖాళీ అయిన స్థానంలో ప్రభుత్వం ఎన్. వెంకట రెడ్డిని నియమించింది.ఇంతకుముందు కరీంనగర్ జిల్లాలో భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ (ఎస్‌డీసీ)గాఆయన విధులు నిర్వహించారు.కీసర ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎల్.రాంమోహన్, కార్యాలయ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన ఆర్డీవోకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఎన్. వెంకట రెడ్డి పేర్కొన్నారు.

## ఆస్తమా వ్యాధి నివారణకు ఉచిత శాఖాహార ఆయుర్వేద మందు

**శ్రీ సాయి కుమార్ వ్యాధి నివారణ ఆశ్రమంలో**



**సికింద్రాబాద్,విశాలభారతి :** సికింద్రాబాద్ పద్మారావునగర్ లోని డా.సాయికుమార్ వ్యాధి నివారణ ఆశ్రమ్ లో మృగశిర కార్తె సందర్భంగా ఆస్తమా వ్యాధి గ్రస్థులకు ఉచితంగా శాఖాహార ఆయుర్వేద మందును పంపిణీ చేశారు. సోమ,మంగళ రెండు రోజుల్లో వందలాది మందికి ఈ మందును అందచేశారు. గత 40 ఏండ్లుగా సంప్రదాయ బద్ధంగా, శాస్త్రోక్తంగా ఈ మందును నిర్విరామంగా భక్తులకు అందచేస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు. అలాగే ప్రతి ఆదివారం ఉదయం బీపీ, షుగర్, సైనస్, మైగ్రెయిన్, తలనొప్పులు, మోకాళ్ళ నొప్పులు, అన్ని రకాల కంటి వ్యాధులకు ఉచితంగా ఆయుర్ యోగిక చికిత్స ఇస్తామని వారు పేర్కొన్నారు.

## మండల అభివృద్ధిపై ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమీక్ష



**దేవరుప్పుల విశాలభారతి:** పాలకుర్తి నియోజకవర్గంలో మండల దేవరుప్పుల మండల అభివృద్ధి, ప్రజా సమస్యలు, మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. పాలకుర్తి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మండలంలోని ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, రైతుల సమస్యలు వంటి అంశాలపై హక్కుల గురించి వివరాలు తెలుసుకుని, పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా నాయకులు కృషి చేయాలని, గ్రామస్థాయిలో ప్రజలు సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పిలుపునిచ్చారు. విద్యా, వైద్య, వ్యవసాయం, మహిళ సంఘాల, యువత ఉపాధి, వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధుల సాధనలో తాను ఉంటానని, ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజా విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతయుతంగా పనిచేయాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి, తండ్రికి తీవ్ర గాయాలు





**బూర్గంపాడు/ విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలో మంగళవారం విషాదం చోటుచేసుకుంది.రోడ్డు ప్రమాదంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఈ ప్రమాదంలో 15 సంవత్సరాల బాలుడు చలికాని గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి తీవ్రంగా గాయపడటంతో స్థానికులు హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు.సారపాక గ్రామానికి చెందిన చెలికాని ప్రవీణ్ (43) తన కుమారుడు చెలికాని గణేష్ తో కలిసి సారపాకలోని ప్రగతి స్కూల్ సమీపంలో చందు బజార్ ప్రాంతంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం సుమారు 1:00 గంట సమయంలో టీఎస్ 28ఎమ్ 5873పై ప్రయాణిస్తుండగా, మోతె వైపు నుంచి సారపాక వైపుకు వస్తున్న జాన్‌డీర్ బుల్ వాహనం నంబర్ ఏపీ31 వివిఎన్ 4660 వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింట్టడంతో గణేష్ రోడ్డుపై పడిపోయాడు బుల్ వాహనం అతని మీద నుంచి వెళ్లిపోవడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. తండ్రి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు వైద్యులు వెల్లడించారు.ఈ ఘటనపై మృతుడి బంధువు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బూర్గంపాడు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.ప్రమాదానికి కారణమైన బుల్ డ్రైవర్ బోరెం అశోక్‌ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు పోలీస్ లను కోరారు.

# పెంకు కార్మికుల న్యాయమైన పోరాటానికి అండగా నిలుస్తాం

- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సిందే
- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోకన్న
- రెండో రోజు కొనసాగిన పెంకు కార్మికుల సమ్మె
- చర్చలకు రావాలని యాజమాన్యాలకు హెచ్చరిక



**బయ్యారం విశాలభారతి:**

పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు, విద్యావైద్య ఖర్చుల భారం, కుటుంబ పోషణకు పెరుగుతున్న వ్యయాల నేపథ్యంలో పెంకు కార్మికుల వేతనాలను తక్షణమే పెంచాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్న డిమాండ్ చేశారు. కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని పెంకు ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. తమ వేతనాలను పెంచాలని, పనికి తగిన గౌరవప్రదమైన జీవన వేతనం కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా నెహ్రూనగర్‌లోని ఉషా పెంకు ఫ్యాక్టరీ వద్ద కార్మికులను కలిసిన అశోకన్న వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పరిశ్రమల అభివృద్ధికి కార్మికులే వెన్నెముక. వారి శ్రమతోనే యాజమాన్యాలు లాభాలు ఆర్జిస్తున్నాయి. కానీ కార్మికుల జీవన ప్రమాణాలు మాత్రం రోజురోజుకూ దిగజారుతున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం అన్యాయం" అని విమర్శించారు. పెంకు తయారీ పరిశ్రమలో పనిచేసే కార్మికులు మండుటెండలు, వర్షాలు, కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ తమ శ్రమను అందిస్తున్నారని, అయినప్పటికీ వారికి కనీస అవసరాలు తీర్చుకునే స్థాయిలో కూడా వేతనాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కుటుంబం గౌరవంగా జీవించాలంటే విద్య, వైద్యం, నివాసం, ఆహారం వంటి మౌలిక అవసరాలు అందుబాటులో ఉండాలని, వాటికి సరిపడే విధంగా వేతనాలు నిర్ణయించాలని అన్నారు. తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ పలుమార్లు యాజమాన్యాలతో చర్చలు జరిపేందుకు ప్రయత్నించినప్పటికీ, ఫ్యాక్టరీ యాజమాన్యాలు స్పందించకుండా మొండి వైఖరి అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల పరిశ్రమల్లో అసంతృప్తి పెరుగుతోందని, ఇది కార్మికయాజమాన్య సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కార్మికుల డిమాండ్లను వెంటనే పరిగణనలోకి తీసుకుని చర్చలకు రావాలని యాజమాన్యాలకు పిలుపునిచ్చిన అశోకన్న, సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని సూచించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు వారి పోరాటానికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ అండగా నిలుస్తుందని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై. బాబులా శ్రీను, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే పాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గ రవి, రాష్ట్ర కోశాధికారి వంగూరి వెంకన్న, రాష్ట్ర నాయకులు జి. గణేష్, ఆదినారాయణ, భూక్య లక్ష్మణ్ తదితరులు పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపారు. కార్మికుల ఐక్యతే వారి హక్కుల సాధనకు ప్రధాన ఆయుధమని నాయకులు పేర్కొన్నారు.

# సంధ్యారాణిని పరామర్శించిన మాజీ మంత్రి



**మహబూబాబాద్ విశాలభారతి:** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కెళ్లపల్లి రవీందర్ రావు సతీమణి శ్రీమతి సంధ్యారాణి ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మంగళవారం మహబూబాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి గారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సత్యవతి రాథోడ్, వైద్యుల సూచనలను కచ్చితంగా పాటిస్తూ తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజా, సామాజిక కార్యక్రమాల్లో తిరిగి చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడిన మాజీ మంత్రి, ఆమె ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకొని ధైర్యం చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ తమతోనే ఉంటారని భరోసా కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మార్నేని రఘు, ఐలి నరహరి గౌడ్, బోడ శ్రీను, గుగులోత్ నెహ్రూ నాయక్, బాదే నాగయ్య తదితరులు పాల్గొన్నారు. నాయకులు సంధ్యారాణి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆమెకు తమ మద్దతును తెలియజేశారు.

# బీఎల్ఏ2 సమావేశానికి సిరికొండ నాయకుల తరలింపు



**ఆదిలాబాద్ జిల్లా, విశాలభారతి:** ఖానాపూర్ ఎమ్మెల్యే మరియు నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుల ఆదేశాల మేరకు ఖానాపూర్‌లో నిర్వహించనున్న బూత్ లెవల్ ఏజెంట్ సమావేశానికి సిరికొండ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఖానాపూర్‌కు బయలుదేరారు. ఈ సమావేశంలో బూత్ స్థాయి పార్టీ నిర్మాణం, ఓటరు జాబితాల పరిశీలన, పార్టీ కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, రానున్న ఎన్నికలకు సంబంధించి కార్యాచరణపై చర్చించనున్నట్లు నాయకులు తెలిపారు. సమావేశానికి హాజరుకానున్న వారిలో సిరికొండ మండల నాయకులు కంచం లక్ష్మన్, ఏఎంసీ డైరెక్టర్ చవాన్ ప్రకాష్, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు పెందూర్ మహేందర్, కొట్నాక్ జంగు, గెడం శివాజీ, కంబ్లే శ్యామ్‌రావు, ఆడ మనకు, పెందూర్ బాధిరావు, బొబ్బిలి బాలాజీతో పాటు పలువురు గ్రామస్థాయి నాయకులు ఉన్నారు. పార్టీ బలోపేతం, బూత్ స్థాయి కార్యకర్తల సమన్వయం మరియు సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యమని నాయకులు పేర్కొన్నారు. సమావేశం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ వారు ఖానాపూర్‌కు పయనమయ్యారు.

# భక్తి తరంగాల్లో తేలిన వెంకటాపూర్

**డప్పుల దరువులు.. బోనాల ఊరేగింపుతో గ్రామమంతా పండుగ శోభ**



**చట్టం / ఎల్లారెడ్డి:** డప్పుల దరువులు, శివసత్తుల విన్యాసాలు, భక్తుల జైజై ధ్వానాలతో మండలంలోని వెంకటాపూర్ గ్రామం మంగళవారం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. గ్రామ ఆరాధ్య దేవతలైన ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ, గంగమ్మ తల్లులకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపుతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. రంగురంగుల సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు బోనాలు ఎత్తుకుని అమ్మవార్ల ఆలయాలకు చేరుకోగా, డప్పు వాయిద్యాల మోతలు, శివసత్తుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ వీధుల గుండా సాగిన బోనాల ఊరేగింపును చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి గ్రామ శ్రేయస్సు కోసం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అయ్యల సాయిలు మాట్లాడుతూ... గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పంటల సమృద్ధి, గ్రామాభివృద్ధి కోసం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ సంప్రదాయాలను కాపాడుకుంటూ భక్తి భావంతో ప్రతి ఒక్కరూ ఉత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పంతులు మహేందర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

# ధారూర్‌లో ఫర్టిలైజర్ దుకాణాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టికల పరిశీలన
- అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులకు ఎరువుల సరఫరా సక్రమంగా జరుగుతున్నదా, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశాలపై వికారాబాద్ జిల్లా కలెక్టర్ మంగళవారం ధారూర్ మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో నిర్వహిస్తున్న స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, ధరల పట్టికలను పరిశీలించారు. అలాగే పాయింట్ ఆఫ్ సేల్ (PoS) యంత్రాల్లో నమోదవుతున్న వివరాలను భౌతికంగా ఉన్న ఎరువుల నిల్వలతో సరిపోల్చి తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, విక్రయాల నమోదులో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు అందించాలని ఆదేశించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే విధంగా అధిక ధరలకు ఎరువులు విక్రయించడం, బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు నిర్వహించడం, నిల్వలను దాచిపెట్టడం వంటి చర్యలు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఎరువుల నిల్వలను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# పోరాటయోధుడు బిర్సా ముండా కు ఘన నివాళి

- పెట్టుబడిదారుల విష కోరల్లో ఏజెన్సీలు
- ఆదివాసి సంపదను దళారులు దారిమళ్లిస్తున్నారు
- ఫిఫ్త్ షెడ్యూల్ ఏరియాలో ఆదివాసులకు పెను సవాలుగా మారిన బినామీల రాజ్యం
- పేపర్లకి పరిమితమై సన్నగిల్లుతున్న ఆదివాసి చట్టాలు ,హక్కులు
- బిర్సా ముండా పోరాట స్ఫూర్తితో దోపిడీ దారులను పారదోలాలి
- ఆదివాసి మహిళా నేత కంగాల రమణకుమారి




**భద్రాచలం, విశాలభారతి:**

ఆదివాసి హక్కుల పోరాట యోధుడు బ్రిటిష్ పరిపాలనను గడగడలాడించిన విప్లవ మూర్తి ఆదివాసి హక్కుల అగ్రనేత బిర్సా ముండా 126 వర్ధంతి సందర్భంగా మహా జన సమితి ఆదివాసి మహిళ రాష్ట్ర కన్వీనర్ కంగాల రమణకుమారి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ బిర్సా ముండా ఉద్యమం ఆదివాస సమాజానికి ఆదర్శమని అటువంటి ఉద్యమం నేటి తరానికి అవసరం అని ఆమె గుర్తు చేశారు. అణువణువు త్యాగాలతో నిండిన చరిత బిర్సా ముండాదని ఆమె కొనియాడారు. ఆయన విప్లవం పోరాటపటిమ ఎనలేనిదని ఆనాడు దొరలు, జమీందారులు, బ్రిటిష్ పరిపాలనలో ఆదివాసి సమాజం పీడనకు, దోపిడీకి గురి అవుతున్న నేపథ్యంలో బిర్సా ముండా ఆదివాసుల రక్షణ కవచంగా నిలిచి మొక్కవోని దీక్ష తోటి దోపిడి దొరల పోకడల పై యుద్ధం ప్రకటించాడని ఆమె పేర్కొన్నారు. ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలను విచ్ఛిన్నం చేస్తుంటే దానికి వ్యతిరేకంగా బిర్సా ముండా ఉద్యమించాడని ఆమె ఉద్ఘాటించారు. చట్టాలు, హక్కుల పరిరక్షణకై తన జీవితాన్ని పణంగా పెట్టి పోరాడిన యోధుడని ఆమె తెలిపారు. నేడు సంస్కృతి సాంప్రదాయాలు , అంతరించిపోతున్నాయని కోయ భాష కూడా మాట్లాడే పరిస్థితి లేదని ఆమె ఆవేదన చెందారు. గిరిజన చట్టాలు కాగితాలకి పరిమితమయ్యాయని ఏ ఒక్క చట్టం కూడా సంపూర్ణంగా అమలు చేసే పరిస్థితి ఫిఫ్త్ షెడ్యూల్ ఏరియాలో లేదని ఆమె మండిపడ్డారు. ఎక్కడ చూసిన పుట్టగొడుగుల బినామీలు రాజ్యమేలుతున్నారని అవి ఆదివాసి సమాజానికి అభివృద్ధి నిరోధకాలుగా మారనున్నాయని ఆదివాసి సమాజం పెను సవాలు ఎదుర్కొనే పరిస్థితి ఉందని ,పెను ప్రమాదంగా దాపురించాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బినామీలను లేకుండా చేయాలని ఆదివాసి సంప్రదాయాలు ,సంస్కృతిని కాపాడుకోవాలని, చట్టాలు, హక్కులు పోరాడి సాధించుకోవాలని ఆమె తెలిపారు. పెట్టుబడుదారులు ఆదివాసి సంపదను తరలిస్తున్నారని , బిర్సా ముండను ఆదర్శంగా తీసుకొని రానున్న రోజులలో క్రియాశీలక పోరాటాలు నిర్వహిస్తే తప్ప ఆదివాసీలకు రాబోయే తరానికి మనుగడ కష్టదాయకంగా మారుతుందనీ ఆమె తెలియజేశారు.

# భూక్యా కాంతి చిత్రపటానికి నివాళులు

**మాజీ మంత్రి సత్యవతి రాథోడ్**



**సిరోల్ , విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని సిరోల్ మండలం పెద్ద లాలు తండాకు చెందిన భూక్యా సోమోజీ గారి తల్లి భూక్యా కాంతి ఇటీవల మరణించడంతో, మాజీ మంత్రివర్యులు శ్రీమతి సత్యవతి రాథోడ్ మంగళవారం వారి నివాసానికి వెళ్లి కాంతి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భూక్యా కాంతి కుటుంబ సభ్యులను పరామర్శించిన సత్యవతి రాథోడ్, వారి మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఈ విషాద సమయంలో భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. భూక్యా కాంతి కుటుంబానికి గ్రామంలో ఉన్న మంచి పేరు, సేవా భావాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కురవి మండల బీఆర్ఎస్ నాయకులు ఐలి నరహరి గౌడ్, బోడ శ్రీను, గుగులోత్ నెహ్రూ నాయక్, బాదే నాగన్న, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు భూక్య బాలాజీ నాయక్, కాంపెలి సొసైటీ మాజీ చైర్మన్ భూక్య బికోజి, మాజీ వైస్ ఎంపీపీ దొంగలి నరసయ్య, ధీరావత్ వీరన్న, మామిళ వెంకన్న (మాజీ ఎంపీటీసీ), భూక్యా చందులాల్, రాములు, మాదాల సుజిత్, నేర్సు శ్రీశైలం, ధీరావత్ దస్రూ, మల్లెపాక వెంకన్న తదితరులు పాల్గొని భూక్యా కాంతి చిత్రపటానికి నివాళులు అర్పించారు. గ్రామ ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై భూక్యా కాంతి కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు.

# ఇప్పపువ్వు లడ్డూల మహిళలకు నైపుణ్య శిక్షణ



**విశాలభారతి, కరకాగూడెం :**

ఇప్పపువ్వు లడ్డూల తయారీతో ప్రత్యేక గుర్తింపు పొందిన చిరుమల్ల గ్రామ మహిళలకు హైదరాబాద్‌లో వారం రోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. స్వయం ఉపాధి, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో మరింత మెలకువలు నేర్చుకునేందుకు మంగళవారం మహిళలు ఈ శిక్షణకు హాజరయ్యారు. వారం రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో ఆహార ఉత్పత్తుల తయారీ, ఆధునిక ప్యాకేజింగ్, మార్కెటింగ్ మెళకువలపై అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు

# సర్పంచ్ భాస్కర్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**కురవి విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని నారాయణపురం గ్రామ సర్పంచ్ ధారవత్ భాస్కర్ ఇటీవల కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న రెడ్యానాయక్, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలను పాటిస్తూ ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ వహించాలని సూచించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులు ఆరోగ్యంగా ఉండాలని, భాస్కర్ త్వరలోనే పూర్తిస్థాయిలో కోలుకొని ప్రజా సేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, తోట లాలయ్య, ముండ్ల రమేష్, గుగులోతు రవినాయక్, మాజీ సర్పంచ్‌లు భూక్య భాస్కర్, బానోత్ ఈర్య నాయక్, వంగూరి భద్రయ్య, చంటి రాజు, బానోత్ బాలు తదితరులు పాల్గొన్నారు. నాయకులు సర్పంచ్ భాస్కర్‌కు ధైర్యం చెబుతూ ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# పోలీస్ స్టేషన్‌లోనే రూ.8.14 లక్షల వసూళ్లు..?

- ఏసీపీ, ఎస్సైలపై సంచలన ఆరోపణలు.. ఎల్బీనగర్ డీసీపీకి బాధితుల ఫిర్యాదు
- రక్షకులే భక్షకులయ్యారు .. న్యాయం చేయాలని మాజీ సైనికుడు, ఎన్ఆర్ఐ ఆవేదన

**విశాల భారతి, ఎల్బీనగర్ :**

ప్రజలను రక్షించాల్సిన పోలీసు వ్యవస్థలోనే తమపై ఒత్తిడి తెచ్చి లక్షల రూపాయలు వసూలు చేశారంటూ ఇద్దరు బాధితులు చేసిన ఆరోపణలు మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లోనే క్రెడిట్ కార్డులు స్వైప్ చేయించి రూ.8.14 లక్షలు వసూలు చేశారని, మిగిలిన రూ.7 లక్షలకు చెక్కులు, ప్రామిసరీ నోట్లు తీసుకున్నారని ఆరోపిస్తూ పల్లం నరేందర్, దారపురెడ్డి నాగేందర్ ఎల్బీనగర్ డీసీపీకి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 2025 జూలైలో నరేందర్, నాగేందర్, సరస్వతి, హరీష్ రాజ్ కలిసి ఉప్పల్ ఎక్స్ రోడ్డు వద్ద "క్వెస్ట్ బిజినెస్ టెక్" పేరుతో సంస్థను ప్రారంభించారు. అనంతరం హరీష్ రాజ్ పరిచయం చేసిన నల్లి సుజాత అనే మహిళ నుంచి చెక్ రిపబ్లిక్ వీసా ప్రాసెసింగ్ కోసం రూ.6.30 లక్షలు తీసుకుని సంబంధిత




వ్యక్తికి చెల్లించినట్లు తెలిపారు. అయితే వీసా ప్రక్రియ పూర్తికాకపోవడంతో డబ్బులు తిరిగి చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

అయితే తమ భాగస్వామి హరీష్ రాజ్ సుజాతతో కలిసి వ్యక్తిగత వ్యాపారం నిర్వహిస్తూ ఆమె నుంచి సుమారు రూ.39 లక్షలు తన వ్యక్తిగత ఖాతాలో జమ చేయించుకున్నాడని, కంపెనీ పేరుతో ఒప్పందాలు కూడా చేసుకున్నాడని ఆరోపించారు. అనంతరం అతను సంస్థ నుంచి తప్పుకున్నప్పటికీ, తమపై ఒత్తిడి పెంచారని వాపోయారు.

**ఏసీపీ కార్యాలయంలో ఒత్తిడి..?**

జూన్ 5న చైతన్యపురి పోలీసులు తమను స్టేషన్‌కు పిలిపించి FIR నంబర్ 623/2026లో నిందితులుగా చేర్చినట్లు తెలిపారని బాధితులు పేర్కొన్నారు. అక్కడి నుంచి ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయానికి తీసుకెళ్లగా, ఏసీపీ కృష్ణయ్య సమక్షంలో సుజాత, ఆమె అనుచరులు ఉన్నారని తెలిపారు. అక్కడ వెంటనే రూ.15 లక్షలు చెల్లించాలని, లేకపోతే జైలుకు పంపి ప్రెస్‌మీట్ నిర్వహించి కార్యాలయాన్ని సీజ్ చేస్తామని బెదిరించారని ఫిర్యాదులో ఆరోపించారు. అదే రోజు రూ.8 లక్షలు, మిగిలిన రూ.7 లక్షలు 15 రోజుల్లో చెల్లించాలని ఒత్తిడి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.

**పోలీస్ స్టేషన్‌లోనే కార్డు స్వైపింగ్..?**

తిరిగి చైతన్యపురి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన అనంతరం తమ మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని లాకప్ సమీపంలో కూర్చోబెట్టారని బాధితులు తెలిపారు. ఈ సమయంలో సుజాత తన కార్యాలయం నుంచి కార్డు స్వైపింగ్ యంత్రాన్ని తీసుకువచ్చి పోలీస్ స్టేషన్‌లోనే క్రెడిట్ కార్డులు స్వైప్ చేయించిందని ఆరోపించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గది ఎదుట ఒక కార్డు, స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో మరికొన్ని కార్డులు స్వైప్ చేసి మొత్తం రూ.8,14,500 వసూలు చేశారని పేర్కొన్నారు. అనంతరం రూ.100 స్టాంప్ పేపర్‌పై ఒప్పందం రాయించి, రూ.7 లక్షలకు సంబంధించిన చెక్కులు కూడా తీసుకున్నారని ఫిర్యాదులో వివరించారు.

**మాజీ సైనికుడు, ఎన్ఆర్ఐ ఆవేదన**

ఫిర్యాదుదారుల్లో ఒకరైన దారపురెడ్డి నాగేందర్ భారత వైమానిక దళంలో పనిచేసి కార్గిల్ యుద్ధం "ఆపరేషన్ విజయ్", పార్లమెంట్ దాడి అనంతరం నిర్వహించిన ఆపరేషన్ పరాక్రమ్ లో పాల్గొన్న మాజీ సైనికుడని తెలిపారు. మరో ఫిర్యాదుదారుడు పల్లం నరేందర్ ఎన్ఆర్ఐ అని పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం సేవలందించిన తనను నేరస్తుడిలా చూసి అవమానించారని నాగేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను రక్షించాల్సిన వ్యవస్థలోనే తమకు అన్యాయం జరిగిందని, అసలు మోసానికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా తమపై ఒత్తిడి తీసుకురావడం బాధాకరమని తెలిపారు.

**సమగ్ర విచారణకు డిమాండ్**

ఈ వ్యవహారంపై స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని బాధితులు ఎల్బీనగర్ డీసీపీని కోరారు. విచారణలో ఎవరైనా బాధ్యులుగా తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరగని పక్షంలో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్, తెలంగాణ డీజీపీని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

# ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

**ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వరరావు**



**విశాలభారతి, మణుగూరు :** ప్రభుత్వ ఐటిఐ లోని ప్రవేశాల కోసం మొదటి విడత ప్రవేశాల గడువు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ ఐటిఐ కృష్ణసాగర్, మణుగూరు ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటిఐ ఏటీసీలలో మొదటి విడత ప్రవేశాల కోసం ఈనెల 8 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేసారు. ఈ దరఖాస్తు గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పినపాక నియోజకవర్గం పరిధిలోని కృష్ణసాగర్, మణుగూరు ప్రభుత్వ ఐటిఐ ఏటీసీలలో ఉన్న కోర్సులకు ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కృష్ణ సాగర్ ఐటిఐ లోని ఎలక్ట్రీషన్ కోర్స్ కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో ఎలక్ట్రీషన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సుల్లో ప్రవేశాలు కోరుతున్నట్లు తెలిపారు. కృష్ణ సాగర్, మణుగూరు ఏటీసీలలో సి ఎన్ సి, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెసింగ్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, వర్చువల్ ఎనాలసిస్ డిజైనర్ అండ్ ఫినెట్ ఎలిమెంట్ మెథడ్ కోర్సులలో ప్రదేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30లోగా ఆన్లైన్లో తమ దరఖాస్తులను అందజేయవలెనని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఆన్లైన్ దరఖాస్తుల కోసం నేరుగా ప్రభుత్వ ఐటిఐ కృష్ణసాగర్, మణుగూరు లో సంప్రదించాలన్నారు. కృష్ణసాగర్ ఐటిఐ కోసం 6305949086, 9866463716,లకు, మణుగూరు ఐటిఐ కోసం 9848853255, 9492959511లకు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు.



## పోలీసు ఆఫీసర్‌గా
# సాయిపల్లవి

'ఏక్ దిన్' చిత్రంలో ఇటీవలే ఓ ప్రేమికురాలిగా తెరపై కనిపించింది ప్రముఖ కథానాయిక సాయిపల్లవి. త్వరలో 'రామాయణ'లో సీతగా అలరించనున్న ఆమె.. ఇప్పుడు పోలీసు అధికారిణిగా నిందితుల్ని పరుగులు పెట్టించడానికి సిద్ధమవుతుందట. తమిళ హీరో ధనుష్ ప్రధాన పాత్రలో రాజ్ కుమార్ పెరియసామి ఓ చిత్రం తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. సాయిపల్లవి, శ్రీలీల కథానాయికలు. 'ధనుష్ 55' (వర్కింగ్ టైటిల్) పేరుతో పట్టాలెక్కిన ఈ సినిమాలో సాయిపల్లవి పోలీసు ఆఫీసర్‌గా సందడి చేయనున్నట్లు సమాచారం. ఇందులో తన పాత్ర పూర్తిగా యాక్షన్ ప్రధానంగా ఉంటుందని, గత చిత్రాలకు భిన్నంగా సాయిపల్లవి కనిపించనుందని తమిళ సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.